జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

శనివారం | 18 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 12



## చిన్నారుల సంక్షేమమే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది

- కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి):** చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి ఆరోగ్యం, పోషణ, విద్యపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని శంభునిపేట, గుంటూరుపల్లి ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలను ఆమె సందర్శించి, అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ స్కూల్ విద్య, ఆరోగ్య సేవలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. పిల్లల ఆరోగ్యం

మిగతా 2 లో...



2 లో..

# భానుడి భగభగ..!

## నగరంలో ఎండ తీవ్రత..!

- ఎండ దెబ్బకు నగర ప్రజలు ఉక్కిరి బిక్కిరి
- ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఎండ తాకిడి
- వాహనదారులు, పాదాచారుల ఆవేదన
- ఉపశమనం కోసం ఎదురుచూపులు
- చలివేంద్రాల కోసం ప్రజల విజ్ఞప్తి

గ్రేటర్ వరంగల్ మహా నగరంలో ఎండలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఏప్రిల్ నెల మొదలైనప్పటి నుంచే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతూ, మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై నడవడం కష్టసాధ్యంగా మారింది. ముఖ్యంగా నగరంలోని ప్రధాన రహదారులు, ట్రాఫిక్ సిగ్నల్స్, బస్టాప్ లు వంటి ప్రాంతాల్లో నిలబడే ప్రజలు ఎండ తీవ్రతను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు సిగ్నల్ వద్ద కొద్ది నిమిషాల పాటు ఆగాల్సి వచ్చినా మండుతున్న ఎండ కింద నిలబడాల్సి వస్తోంది. హెల్మెట్ లు ధరించిన బైక్ రైడర్లు వేడి తట్టుకోలేక అలసటకు గురవుతున్నారు. పాదాచారులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఈ పరిస్థితుల్లో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● వరంగల్ సిటీ, ప్రజాజ్యోతి




## భర్త హత్యకు.. భార్య సుపారి

- మిస్సింగ్ కేసు మర్డర్ గా వెలుగులోకి
- అక్రమ సంబంధం నేపథ్యంలో కుట్ర
- రూ.5 లక్షల ఒప్పందం
- దారుణంగా హత్య చేసి ఆధారాల నాశనం

**పరకాల, ఏప్రిల్ 17, (ప్రజాజ్యోతి):** హనుమకొండ జిల్లా పరకాల పరిధిలో సంచలనం రేపిన మిస్సింగ్ కేసు హత్యగా తేలింది. ఈ నెల 8వ తేదీన మడికొండ సాంబయ్య తన కుమారుడు సుమన్ భరత్ కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి అసలు నిజాన్ని వెలికితీశారు. పోలీసుల విచారణలో బయట పడిన వివరాల ప్రకారం... పరకాలకు చెందిన సుమన్ భరత్ (38)కు 2012లో లావణ్యతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా, లావణ్యకు ఇమ్మడి నరేశ్ తో పరిచయం

మిగతా 2 లో...

## ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధం

- సుమారు 7 ఎకరాల పంట నష్టంతో కంటనీరు పెట్టిన రైతులు

**ఖానాపురం /ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి)** ఖానాపురం మండలం నాజీ తండా గ్రామపంచాయతీ పరిధిలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంతో మొక్కజొన్న పంట కాలిపోయింది. స్థానిక రైతులు బాధావత్ రాంజీ, గుగులోత్ బాలు, భూక్య స్వామికి చెందిన సుమారు 7వ నెల పంట కాలిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కాలిపోవడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకొని సహాయం అందించాలని కోరారు.



## నో హెల్మెట్... నో పెట్రోల్" అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్ కలెక్టరేట్ ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):** ప్రజాపాలన–ప్రగతి కార్యాచరణ లో భాగంగా జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పెట్రోల్ బంక్ యజమానులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయడానికి "నో హెల్మెట్... నో పెట్రోల్" అనే విధానాన్ని కఠినంగా అమలు చేయాలని పెట్రోల్ బంక్ యజమాన్యాన్ని ఆదేశించారు. పెట్రోల్ బంకులకు వచ్చే వాహన దారులకు హెల్మెట్ అవసరంపై అవగాహన కల్పించాలని, నియమాలు పాటించేవారిని ప్రోత్సహించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని, ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంచడంలో పెట్రోల్ బంక్ యజమానులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ పేర్కొన్నారు. శనివారంతో అరైవ్ అలైవ్ కార్యక్రమం చివరి రోజున పెట్రోల్ బంకుకి హెల్మెట్ ధరించి సీట్ బెల్ట్ ధరించి వచ్చే వారికి గులాబీ పువ్వును బహుకరించి సురక్షితమైన ప్రయాణం చేయాలని సూచించాలని వాహన దారులకు అవేర్నెస్ కల్పించే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, పెట్రోల్ బంక్ యజమానులు పాల్గొన్నారు.



## చిన్నారుల సంక్షేమమే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది



(మొదటి పేజీ తరువాయి...)

అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా అన్న విషయాన్ని వివరంగా తెలుసుకున్నారు. గుంటూరుపల్లి అంగన్వాడి కేంద్రంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, తుది మెరుగులతో పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్రానికి కాంపౌండ్ గోడ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసి వెంటనే పనులు చేపట్టాలని సూచించారు. శంభునిపేట అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించాలని, పిల్లల పోషణ మరియు ఆరోగ్యంపై సిబ్బంది మరింత శ్రద్ధ వహించాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రాల్లో మౌలిక వసతులు, శుభ్రత, హాజరు నమోదులను కూడా పరిశీలించి, అవసరమైన మెరుగుదల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక బాల్యవివాహాల నియంత్రణలో మహిళలు ముందుండాలని, గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఆడపిల్ల డిగ్రీ వరకు తప్పనిసరిగా చదువుకోవాలని, విద్య ద్వారా వారి ఆలోచనా శక్తి పెరిగి భవిష్యత్తును నిర్మించుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, సీడీపీఓ విద్య, సూపెర్వైసర్ కళ్యాణి, పోషణ అభియాన్ డీసీ కార్తీక్, టీచర్ భవానీ, హెల్పర్ సరిత, గర్భిణీ, బాలింతలు, పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## భర్త హత్యకు భార్య సుపారి




(మొదటి పేజీ తరువాయి...)

ఏర్పడి, అది అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో భర్త తరచూ మద్యం సేవించి వేధింపులకు గురిచేస్తున్నాడని భావించిన లావణ్య, అతన్ని హత్య చేయాలని నిర్ణయించింది. ఈ కుట్రలో భాగంగా తన తమ్ముడు పెండల రాజు, ప్రియుడు నరేశ్ లతో కలిసి గోవిందరావుపేటకు చెందిన చిరంశెట్టి వెంకటేశ్వర్లును సంప్రదించి రూ.5 లక్షలకు సుపారి ఇచ్చారు. ముందుగా రూ.4.59 లక్షలు చెల్లించారు. ఏప్రిల్ 3న రాత్రి సుమన్ భరత్ ను ములుగు ప్రాంతానికి మాయమాటలతో పిలిపించి, వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించారు. అతను మత్తులో ఉండగా వెంకటేశ్వర్లు బీర్ బాటిల్ తో తలపై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం పెట్రోల్ పోసి మృతదేహాన్ని తగులబెట్టారు. ఈ ఘటనను నిందితులు వీడియో కూడా తీశారు. తరువాతి రోజు లావణ్య, రాజు అక్కడికి వెళ్లగా వీడియోలు చూపించి మిగిలిన డబ్బు తీసుకున్నారు. అనుమానం రాకుండా లావణ్య పరకాలకు తిరిగి వెళ్లింది. ఆపై నిందితులు మృతదేహ అవశేషాలను సంచిలో వేసి సమీప వాగులో పడేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని సంఘటనా స్థలానికి తీసుకెళ్లగా, అక్కడి నుండి ఎముకల ముక్కలు, బూడిద, బీర్ బాటిల్ ముక్కలు తదితర ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. దయ్యాల వాగులో పడేసిన అవశేషాలను కూడా సీజ్ చేశారు. ఈ కేసులో మొత్తం ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు, వారి వద్ద నుండి ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది



# భానుడి భగభగ..!

## నగరంలో ఎండ తీవ్రత..!

- ఎండ దెబ్బకు నగర ప్రజలు ఉక్కిరి బిక్కిరి
- ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఎండ తాకిడి
- వాహనదారులు, పాదాచారుల ఆవేదన
- ఉపశమనం కోసం ఎదురుచూపులు
- చలివేంద్రాల కోసం ప్రజల విజ్ఞప్తి

గ్రేటర్ వరంగల్ మహా నగరంలో ఎండలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఏప్రిల్ నెల మొదలైనప్పటి నుంచే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతూ, మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై నడవడం కష్టసాధ్యంగా మారింది. ముఖ్యంగా నగరంలోని ప్రధాన రహదారులు, ట్రాఫిక్ సిగ్నల్స్, బస్టాప్ లు వంటి ప్రాంతాల్లో నిలబడే ప్రజలు ఎండ తీవ్రతను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు సిగ్నల్ వద్ద కొద్ది నిమిషాల పాటు ఆగాల్సి వచ్చినా మండుతున్న ఎండ కింద నిలబడాల్సి వస్తోంది. హెల్మెట్ లు ధరించిన బైక్ రైడర్లు వేడి తట్టుకోలేక అలసటకు గురవుతున్నారు. పాదాచారులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఈ పరిస్థితుల్లో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● వరంగల్ సిటీ, ప్రజాజ్యోతి

చాలా చోట్ల చెట్ల నీడ లేకపోవడం, తాగునీటి సదుపాయం లేకపోవడం వల్ల ప్రజలు తాగునీటి కోసం దూరం వెళ్లాల్సి వస్తోంది. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు లేకపోవడం గమనార్హం. వేసవికాలంలో ఇలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయడం ముఖ్యమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయడం, బస్టాప్ ల వద్ద నీడ కల్పించడం, ముఖ్య ప్రాంతాల్లో ఉచిత తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుంటే ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని వారు కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద తాత్కాలిక షెడ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, పబ్లిక్ ప్రదేశాల్లో తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలి. అలాగే ప్రజల్లో ఎండాకాల జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కూడా అవసరం. మొత్తానికి వరంగల్ నగరంలో మండుతున్న ఎండలు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తుండగా, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన అవసరం అత్యవసరంగా మారింది.



### వేసవిలో ఆరోగ్యం కాపాడుకోవాలి:



**–డా. ఆకారపు రాజగోపాల్, ఫ్యామిలీ ఫిజీషియన్, మాధవ హాస్పిటల్, రంగశాయిపేట.**

ప్రస్తుతం ఉన్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా హీట్ స్ట్రోక్ ప్రమాదం ఎక్కువగా ఉంది. అందువల్ల ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల వరకు నీరు తాగడం అవసరం. బయటకు వెళ్లేటప్పుడు తలకు కప్పుకునే వస్త్రం లేదా టోపీ ఉపయోగించడం మంచిది. తేలిక పాటి, సడలుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య బయటికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం అని తెలిపారు. అలాగే చర్మం ఎండిపోయినట్లు అనిపించడం, తల తిరగడం, అలసట, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే అవి హీట్ స్ట్రోక్ సంకేతాలు కావచ్చు. అలాంటి సందర్భాల్లో వెంటనే నీరు తాగించి, చల్లని ప్రదేశంలో విశ్రాంతి ఇవ్వాలి. పరిస్థితి తీవ్రమైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని డా. రాజగోపాల్ సూచించారు.

### ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నరకం:

**కొట్టే వినయ్, ప్రభుత్వ ఉద్యోగి, రంగశాయిపేట.**



రోజూ ఆఫీసుకి వెళ్లేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద 2–3 నిమిషాలు ఆగాల్సి వస్తోంది. కానీ ఆ కొద్ది సమయం కూడా చాలా కష్టంగా అనిపిస్తోంది. ఎండ తాకిడి వల్ల చెమటలు పట్టి అలసిపోతున్నాం. ఎక్కడా నీడ లేదు, తాగునీరు లేదు. ముఖ్య కూడళ్ల వద్ద గ్రీన్ మ్యాట్ షెడ్లు ఏర్పాటు చేస్తే చాలా ఉపశమనం కలుగుతుంది అని అన్నారు. ఇంకా రోడ్లపై బస్టాప్ వద్ద కూడా ఎలాంటి నీడ లేదు. కొందరు మహిళలు పిల్లలతో కలిసి నిలబడటం చాలా కష్టంగా మారింది. కనీసం తాగునీటి సదుపాయం ఉండాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# రోడ్డు భద్రతపై అవగాహనకు ప్రజల మద్దతు

- హెల్మెట్ తప్పనిసరి
- ఏసీపీ ప్రశాంత్ రెడ్డి పిలుపు




**హసన్‌పర్తి,ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి):** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమానికి గ్రామస్థుల నుండి విశేష స్పందన లభించింది. హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహ భరితంగా సాగింది.హసన్‌పర్తి సీఐ చేరాలు ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేయగా, ఈ కార్యక్రమానికి కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించి, హెల్మెట్ వినియోగం అవసరాన్ని ప్రజలకు వివరించారు.వైద్యుడు రమేష్ సహకారంతో సుమారు వందమందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. హెల్మెట్ మన ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని, చిన్న గాయమే అయినా ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు.వాహనంపై బయలుదేరిన ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారన్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించడం ద్వారా మన ప్రాణాలను, మన కుటుంబ భవిష్యత్తును కాపాడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవి, గోవర్ధన్, స్థానిక ప్రజాప్రతినిధి లావుడ్య రవి నాయక్, వైద్యుడు రమేష్, గ్రామ పెద్దలు, యువకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌సీ అమలు చేయాలని ఉద్యోగుల వినతి



**ధర్మసాగర్, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):** పీఆర్‌సీ (PRC)ను వెంటనే అమలు చేయాలని కోరుతూ ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ పీఆర్‌సీ అమలులో జరుగుతున్న ఆలస్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల జీతాల సవరణను తక్షణమే అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు.అలాగే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు.ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## పార్టీలు మారినా ప్రజల సేవే లక్ష్యం

- కాంగ్రెస్‌లోకి మేడిశెట్టి రాములు ప్రవేశం... అవకాశం కోసం ఎదిరిచూపూలు





**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన మేడిశెట్టి రాములు రాజకీయ జీవితం అనేక ఒడిదుడుకుల మధ్య సాగుతూ ప్రస్తుతం మరో కీలక దశలోకి చేరుకుంది. ఆయన రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీ (టిడిపి)తో ప్రారంభమై, గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల ఆదరణ పొందారు. జడ్పిటిసిగా గెలుపొందిన ఆయనకు ఒక దశలో జెడ్పీ చైర్మన్ పదవి అవకాశమొచ్చినా, రాజకీయ కారణాల వల్ల అది దక్కకపోవడం తెలిసిందే. అయినప్పటికీ ఆయన ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ జిల్లాస్థాయిలో మంచి గుర్తింపు సాధించారు. తర్వాత రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో, తన అనుచరులు, కార్యకర్తల ఒత్తిడితో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సారథ్యంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. అక్కడ కూడా గ్రామీణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తూ ప్రజల మధ్య తన స్థానం నిలబెట్టుకున్నారు. అయితే టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిన తర్వాత స్థానిక రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకోవడంతో కొందరు నాయకులతో విభేదాలు ఏర్పడ్డాయని సమాచారం. ఈ నేపథ్యంలో తనపై ఆరోపణలు మోపి, పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు ఆయన అనుచరులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామం పర్వతగిరి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా వెనుకడుగు వేయకుండా మేడిశెట్టి రాములు తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజలకు మరింత చేరువగా ఉండాలని సంకల్పించారు. భవిష్యత్తులో ఎలాంటి పదవులు ఆశించకుండా ప్రజా సేవకే ప్రాధాన్యత ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, పేదలకు సంక్షేమ పథకాల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. మేడిశెట్టి రాములు తీసుకున్న ఈ నిర్ణయం పర్వతగిరి మండల రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ వెంకటస్వామి కి వినతి



ప్రధాన డిమాండ్లు: –

- జూన్ 2 నాటికి పీఆర్సీ అమలు
- రిటైర్డైన ఉద్యోగుల పెండింగ్ బిల్లులు తక్షణ చెల్లింపు
- ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ అమలు, హెల్త్ కార్డుల జారీ
- సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ
- 2004 సెప్టెంబర్ 1కు ముందు నియామకాలకు ఓపీఎస్ అమలు
- పెండింగ్ డీఏలు, ఇతర బిల్లుల విడుదల
- వీఆర్ఏల సమస్యల పరిష్కారం
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్, ఉద్యోగ భద్రత
- ఉద్యోగులు, ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు వెంటనే
- ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందింపు

**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి)** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు & పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల తహసీల్దార్ టి. వెంకటస్వామి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన అనేక ముఖ్యమైన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలు చేయాలని, రిటైరైన ఉద్యోగులకు పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను అమలులోకి తీసుకువచ్చి హెల్త్ కార్డులు జారీ చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇంకా పెండింగ్ డీఏలు విడుదల చేయడం, వీఆర్ఏల సమస్యలను పరిష్కరించడం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించడం వంటి డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు వెంటనే చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత తీవ్ర ఆందోళనలకు దిగాల్సి వస్తుందని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా రాములు, జనరల్ సెక్రటరీ మేడిది నాగేశ్వరరావు, డిటీఎఫ్ అధ్యక్షుడు మహంకాళి రామస్వామి, జనరల్ సెక్రటరీ బొలుగొడ్డు శ్రీధర్, యూటీఎఫ్ అధ్యక్షుడు వి. సంపత్, అరవింద్, ఎస్టీయు అధ్యక్షుడు నిరంజన్, టిఎపియుఎస్ అధ్యక్షుడు ఆనంద్ మోహన్, జనరల్ సెక్రటరీ భాస్కర్ రావు, టిపిటీఎఫ్ జనరల్ సెక్రటరీ రమేష్, టిపిఆర్టియు అధ్యక్షుడు రాజు,ఎస్ సి, ఎస్టి జిల్లా అధ్యక్షుడు పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చండి

- ఇందిరానగర్ గ్రామ సర్పంచ్ అంబాల రాజ్ కుమార్




**ఎల్కతుర్తి ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి)** ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్ గ్రామంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అనే అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి గ్రామ ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంబాల రాజ్ కుమార్ ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- మాజీ సర్పంచ్ కోల్లురి వెంకటేశ్వర్లు



**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి)** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోల్లురి వెంకటేశ్వర్లు మండల కేంద్రములో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సర్పంచ్ పిరియడ్ లో చేసిన అభివృద్ధి పనుల సంబంధించిన పెండింగ్ బిల్లులు నేటి వరకు రాకపోవడంతో ఆర్థికంగ సామాజికంగా సమాజంలో తిరుగలేకపోతున్నామని వడ్డీలు తేచ్చి మరి చేసిన పనులకు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా బిల్లులు చెల్లించకపోవడంతో సరికాదని అన్నారు. చేసిన పనులకు యంబిలు, పాలకవర్గం చేసిన తీర్మానాలు, దసరా పండుగలకు నిర్వహించిన పనులకు పెండింగ్ బిల్లుల తో సహా ఉన్న చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రసుతం ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు అయ్యాయి అని అధికారులు పెండింగ్ బిల్లులు చేల్లిస్తామని చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా ఉన్నత అధికారులు ప్రత్యేక చోరవ తీసుకొని పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించే విధంగా కృషి చేయాలని కోరారు.

# డిమాండ్లు పరిష్కరించాలి.. లేదంటే ఆందోళనలు ఉధృతం

- పర్వతగిరిలో తహసీల్దార్ కి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాన్ని సమర్పించారు



**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి)**రాష్ట్రవ్యాప్తంగా టీజీఈజెఏసి పిలుపు మేరకు జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా, పర్వతగిరి మండలంలో పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం, వరంగల్ జిల్లా తరఫున సమర్పించిన ఈ వినతిపత్రంలో పలు కీలక సమస్యలను ప్రస్తావిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రంలో ప్రధానంగా 2వ పీఆర్సీ అమలు చేయాలని, నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, ఉద్యోగులకు సరైన వైద్య సదుపాయాలు అందేలా EHS ఆరోగ్య కార్డుల సమస్యలను పరిష్కరించాలని, ప్రస్తుతం అమల్లో ఉన్న CPS విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతి (OPS)ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమకు సరైన సదుపాయాలు, భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.కార్యక్రమంలో స్టేట్ జెఏసి అసోసియేట్ ప్రెసిడెంట్ టి. శేషు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల సమస్యలు ఒకేలా ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. అలాగే టిఎన్ జి ఓ జిల్లా నాయకులు ఎస్. రఘు, డి. రజిత, అశోక్ లు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధనలో ఐక్యతే బలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది రూపేష్ కుమార్, దుర్గా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఫోరం జిల్లా బాధ్యులు ఎస్. కిరణ్, ధర్మేంద్ర, సుధాకర్, శాంత తదితరులు పాల్గొని కార్యదర్శులకు సంఘీభావం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు అధిక సంఖ్యలో హాజరై తమ డిమాండ్లపై గళమెత్తారు.

# బాధిత కుటుంబలకు అండగా ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి**వరంగల్ జిల్లా రాయపర్తి మండలం శివరామాపురం'గ్రామం సుభాష్ తండాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ బాలు తల్లి మంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, శుక్రవారం వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేసి మరియు అనారోగ్యంతో ఇటీవల చికిత్స తీసుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బాధవత్ బక్కులు, బాధవత్ లచ్చు లను పరామర్శించి, ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుల పరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్ మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, ఐత రామ్ చందర్, నాగపూరి సోమన్న, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి,స్థానిక నాయకులు అయిన మాజీ సర్పంచ్ చెడుపాక కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్య జగన్,పార్టీ నాయకులు మేకల మహేష్, ప్రవీణ్, సర్వన్, సుమన్, శ్రీనివాస్, రవీందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వర్ధన్నపేట ఏఎంసి వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి



**రాయపర్తి ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో జాంబవ రైతు ఉత్పత్తిదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలోముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ఏ ఏం సి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి అన్నారు, రైతులు ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోనీ,క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర పొందాలని అన్నారు,రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా మార్క్ ఫెడ్ కేంద్రాల్లో విక్రయించాలని పిలుపునిస్తున్నారు. ఈ కార్యక్రమంలో..స్థానిక సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి,మండల వ్యవసాయ శాఖ అధికారి వీరభద్రం,తొర్రూర్ బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హమ్య నాయక్,వర్ధన్నపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి దామోదర్,మహబూబ్నగర్ గ్రామ సర్పంచ్ పెండ్లి మహేందర్ రెడ్డి,పెరికేడు గ్రామ సర్పంచ్ తీగల సాయిలు,రాయపర్తి గ్రామ ఉప సర్పంచ్ మచ్చ రమేష్,జాంబవ రైతు ఉత్పత్తిదారుల సేవా సంఘం కార్యదర్శి ఐత బ్రహ్మం,ఉకల్ సర్పంచ్ లాలమ్మ,వర్ధన్నపేట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకన్న, వర్ధన్నపేట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నయీమ్,నర్సింహా మూర్తి,మండల నాయకులు భూక్య పరమేష్,షేక్ రఫీక్,మందపూర్ యాకయ్య, మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# 19న ఇంటర్మీడియట్ గిరిజన గురుకుల ప్రవేశ పరీక్ష



**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి)** గిరిజన గురుకుల విద్యాసంస్థలు, కళాశాలలలో ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్షను ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు పర్వతగిరి మండలంలోని జమాల్ పురం గిరిజన గురుకుల పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. శైలజారాణి తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లు వెంటనే డౌన్ లోడ్ చేసుకొని, తమ పరీక్షా కేంద్ర వివరాలను ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. పరీక్షా రోజున కనీసం ఒక గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. హాల్ టికెట్ తో పాటు ఆధార్ కార్డు లేదా ఇతర ఫోటో ఆధారిత గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ నియామకం

**వరంగల్, ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి):**వరంగల్ జిల్లా మీడియా ప్రతినిధుల గుర్తింపు (అక్రిడిటేషన్) ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి మీడియా అక్రిడిటేషన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక శుక్రవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా శ్రీరామ్ రామచందర్, మెందు రవీందర్, దొంతు నవీన్, ఎండి హుస్సేన్ పాషా, మట్టా దుర్గాప్రసాద్, కోదాటి గోపాలకృష్ణ, పల్లెల్ల సోమేశ్వర రావు, పెద్దపల్లి వరప్రసాద్, బొడిగ శ్రీనివాస్, బొల్లెపల్లి రాజును నియమించారు. అదనంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి(డీపీఆర్ఓ) ఆయుబ్ అలీ మెంబర్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. కమిటీలో దక్షిణ మధ్య రైల్వే, టీజీఎస్ఆర్టీసీ ప్రతినిధులు, సమాచార శాఖకు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ సభ్యులుగా కొనసాగనున్నారు. ఈ కమిటీ ప్రధానంగా మీడియా ప్రతినిధుల అక్రిడిటేషన్ దరఖాస్తులను పరిశీలించడం, అర్హతల నిర్ధారణ, మార్గదర్శకాల అమలు వంటి అంశాలను పర్యవేక్షిస్తుంది. జిల్లా స్థాయిలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వానికి తెలియజేయడంలో కూడా కమిటీ కీలక పాత్ర పోషించనుంది. కొత్తగా ఏర్పడిన కమిటీ తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ, కమిటీ సమర్థవంతంగా పనిచేసి జర్నలిస్టులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు.



# ఉద్యోగ ఉపాధ్యాయుల గర్జన ... సంగెంలో భారీ నిరసన ప్రదర్శన..!

- జూన్ 2 లోపు PRC అమలు చేయాల్సిందే..TGE JAC డిమాండ్
- పెండింగ్ బిల్లులు చెల్లించాలి..పాత పెన్షన్ అమలు చేయాలని తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత




**సంగెం,ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి ):**తెలంగాణ ఎంప్లాయిస్, టీచర్స్,గెజిటెడ్ ఆఫీసర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ(TGEJAC)పిలుపు మేరకు శుక్రవారం రోజున సంగెం మండల కేంద్రంలో ఉద్యోగ,ఉపాధ్యాయులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు.తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి,అనంతరం స్థానిక తహశీల్దార్ కి వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ క్రింది డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**PRC అమలు:**జూన్ 2,2026 లోగా నూతన వేతన సవరణ(PRC)నివేదికను అమలు చేయాలి.

**పెండింగ్ బిల్లులు:**సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బిల్లులను రెండు విడతల్లో తక్షణమే చెల్లించాలి.

**హెల్త్ కార్డులు:**మే 1 నుండి ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డుల విధానాన్ని అమలు చేయాలి.

**పాత పెన్షన్ పునరుద్ధరణ:**సిపిఎస్(CPS)విధానాన్ని రద్దు చేసి,2003 DSC ఉపాధ్యాయులకు తక్షణమే పాత పెన్షన్ (OPS) వర్తింపజేయాలి.

ఈ నిరసన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సముద్రాల నర్సింహాచార్యులు,TRENGA రాష్ట్ర అధ్యక్షులు కొడిమల్ల రవి,UTF వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాను ప్రసాద్,PRTUTS రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నర్సింహాస్వామి పాల్గొన్నారు.అలాగే PRTUTS మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజ్జెల విజయ్ కుమార్,బరిగెల కాంతారావు,UTF నాయకులు N.కుమారస్వామి,పి.శివ ప్రసాద్,DTF నాయకులు M.శ్యామ్ సుందర్,కే.శ్రీనివాస్,STU నాయకులు రమేష్,సాంబామూర్తి,RUPP నాయకులు బి.వినోద,రవీందర్,జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ శాస్త్రి,ఎన్.రాజేందర్,MPDO ఆఫీస్ సిబ్బంది,సీఆర్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధోనికెల శ్రీధర్,ఉపాధ్యాయులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# ఉద్యోగ భవిష్యత్తుకు సీకేఎం డిగ్రీ కళాశాల సరైన వేదిక

- కళాశాల ప్రిన్సిపల్ ఏ.ధర్మారెడ్డి
- దోస్త్‌లో సీకేఎంకు ఫస్ట్ ప్రిఫరెన్స్ ఇవ్వండి
- సీకేఎం ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం
- విద్యార్థులు తప్పక వినియోగించుకోవాలి



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి):** డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు తప్పనిసరిగా దేశాయిపేట లోని చందకాంతయ్య మెమోరియల్ (సీకేఎం) ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను తమ మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఏ ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాలలో డిగ్రీ ప్రవేశాల గోడ పత్రికను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్ వ్యవస్థ ద్వారా మాత్రమే ప్రవేశాలు జరుగుతున్నందున, విద్యార్థులు సమయానికి నమోదు చేసుకొని సీకేఎంను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో విద్యకు తోడు ఉద్యోగావకాశాలు కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్న ప్రిన్సిపల్, అదే దిశగా సీకేఎం కళాశాల ప్రత్యేకమైన ఇండస్ట్రీ ఫ్రెండ్లీ డిగ్రీ ప్రోగ్రామ్స్‌ను ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో హెచ్ ఆర్ ఆపరేషన్స్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (ఎం ఎల్ టి), డెయిరీ అండ్ పౌల్ట్రీ మేనేజ్‌మెంట్ వంటి ఆధునిక కోర్సులను అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కోర్సుల ప్రత్యేకత ఏమిటంటే విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే పరిశ్రమల అనుభవాన్ని పొందేలా పాఠ్య ప్రణాళిక రూపొందించబడింది. ఫస్ట్ ఇయర్‌లో ఒక నెల, సెకండ్ ఇయర్‌లో రెండు నెలలు, ఫైనల్ ఇయర్‌లో పూర్తి స్థాయి ఇండస్ట్రీ ట్రైనింగ్ ఇవ్వబడుతుందని తెలిపారు. దీంతో విద్యార్థులు చదువుతో పాటు ప్రాక్టికల్ అనుభవం సంపాదించి, కోర్సు పూర్తయ్యే సమయానికి ఉద్యోగానికి సిద్ధమవుతారని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో స్టైపెండ్ కూడా పొందే అవకాశం ఉండటం మరో ప్రత్యేకత అని అన్నారు. ప్రతి కోర్సులో 60 సీట్లు మాత్రమే ఉండటంతో పోటీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అందువల్ల విద్యార్థులు తొందరగా దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ కోర్సులను విస్తరించేందుకు కట్టుబడి ఉందని, ఈ ఏడాది సుమారు 18,000 మంది విద్యార్థులను ఈ ప్రోగ్రామ్స్‌లో చేర్చాలనే లక్ష్యం ఉన్నట్లు వివరించారు. సీకేఎం కళాశాల విద్యా ప్రమాణాల విషయానికొస్తే, ఇది ఆరు దశాబ్దాలుగా ఉన్నత విద్యలో ప్రత్యేక గుర్తింపు సాధించిన సంస్థగా నిలిచిందని ధర్మారెడ్డి పేర్కొన్నారు. యూనివర్సిటీ స్థాయిలో అనేక ర్యాంకులు సాధించిన ఘనత ఈ కళాశాలకు ఉందని గుర్తుచేశారు. కళాశాలలో 25కి పైగా కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక సైన్స్ ల్యాబ్స్, రీసెర్చ్ ఫెసిలిటీస్, జువాలజీ మ్యూజియం, బోటనీ ల్యాబ్స్ వంటి సదుపాయాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదనంగా, ఉచిత కోర్స్ మెటీరియల్, ఆధునిక బోధన పద్ధతులు, కమ్యూనికేషన్ స్కిల్స్, కార్పొరేట్ కల్చర్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడల్లో కూడా విస్తృత అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని, ముఖ్యంగా అమ్మాయిలకు ఎన్సీసీలో అవకాశాలు కల్పించడం ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఎన్సిసి లో చేరే విద్యార్థులకు రూ. 4620 ల నగదు ప్రోత్సాహం కేంద్ర ప్రభుత్వం ద్వారా నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేయబడుతుందని తెలిపారు. మొత్తంగా విద్య, అనుభవం, ఉద్యోగావకాశాలను సమన్వయం చేసిన సీకేఎం ప్రభుత్వ కళాశాలలో చేరడం ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తును బలపరుచుకోవచ్చని ప్రిన్సిపల్ ధర్మారెడ్డి స్పష్టం చేశారు. వెంటనే దోస్త్ ద్వారా దరఖాస్తు చేసి సీకేఎంను ఎంపిక చేసుకోవాలని మరోసారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ ధర్మారెడ్డి తో పాటు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ విజయపాల్ రెడ్డి, దోస్త్ మరియు అడ్మిషన్స్ కన్వీనర్ కెప్టెన్ డాక్టర్ పి సతీష్ కుమార్, వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్ అనిల్, శ్రీనివాస్, పాషా, స్రవంతి, హరిబాబు, మమత, జయంతి తదితరులు పాల్గొన్నారు.

# గుడి నిర్మాణానికి అడ్డుపడుతున్న బి.ఎం.ఎస్ నాయకుడి ఇంటి ముందు భారీ ధర్నా

- ధర్నాలోపెద్ద ఎత్తున పాల్గొన్న కాలనీ మహిళలు, యువకులు
- బీజేపీ, భజరంగ్దల్ నాయకులు స్పందించాలి



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, ఏప్రిల్ 17**కారల్ మార్క్స కాలనీలో గత 30 సంవత్సరాలుగా ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా పనులు చేపడుతున్న క్రమంలో అడ్డుపడుతున్న బిఎంఎస్ నాయకుడి ఇంటిముందు కారల్ మార్క్స కాలనీ మహిళలందరూ పెద్ద ఎత్తున పాల్గొని అతనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు ఈ సందర్భంగా కారల్మార్క్స కాలనీ యువకులు మాట్లాడుతూ కాలనీలో 30 సంవత్సరాలుగా ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్ నిర్మించాలని ఉద్దేశంతో పనులు చేపడుతున్న క్రమంలో బిఎంఎస్ నాయకులు అప్పాని శ్రీనివాస్ సింగరేణి స్థలంలో దేవాలయ నిర్మాణం చేపడుతున్నారని జిఎం దగ్గర దొంగ సంతకాలు చేయించి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్నారు శాంతియుతంగా నిరసన చేపడుతున్న క్రమంలో బిఎమ్ఎస్ నాయకుని అప్పాని శ్రీనివాస్ గారి భార్య అక్రమంగా నిర్మించుకున్న గేటు ద్వారా బయటికి వచ్చి ప్రతిరోజు కాలనీవాసులను నానా బూతులు తిడుతూ శాపనార్థాలు పెడుతున్నారన్నారు.. ఆయన ఆఫీసు నిర్మించుకోవడానికి అంబేద్కర్ బొమ్మ వద్ద సింగరేణి స్థలం కావాలి కానీ భక్తులు దేవాలయం నిర్మించుకుంటే వొచ్చే బాధ ఏంది అని అన్నారు..

**››› బీజేపీ, భజరంగ్దల్, నాయకులు స్పందించాలి...**

ఆలయం నిర్మించాలని గత వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న క్రమంలో భూపాలపల్లి పట్టణంలో ఉన్న బిజెపి నాయకులు బజరంగ్దళ్ నాయకులు చూసి చూడనట్టుగా వివరిస్తున్నారని నిన్నటి రోజున ఒక సంఘటన జరిగితే అందరు పోయి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి బజరంగ్దళ్ విశ్వహిందూ నాయకులకు ఇక్కడ గుడి కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతుంటే వాళ్ళ కండ్లకు కనబడత లేదా అని ప్రశ్నించారు.. అంటే మీ యొక్క కార్యక్రమాలు వ్యక్తిని బట్టి ఉంటాయా అని ప్రశ్నించారు అడ్డుకుంటున్నారని కాలనీవాసులంతా వారం రోజులకు గగ్గోలు పెడుతుంటే ఒక్క బీజేపీ బజరంగ్దళ్ నాయకులు స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు .ఇకనైనా ఇక్కడున్న బీజేపీ నాయకులు స్పందించి బిఎంఎస్ నాయకుని మీ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని లేకపోతే కాలనీవాసులంతా కలిసి బిజెపి ఆఫీసును ముట్టడించడానికి కూడా సిద్ధంగా ఉన్నారన్నారు .ఈ కార్యక్రమంలో క్యాతరాజు సతీష్ అశోక్,రాకేష్, తూముల శ్రీనివాస్ అభిలాష్, బోద పద్మ శారద, రాజు, విజయ్, అనిల్, సోనూ, కిషోర్, ఓంకార్,సుమారు 200 మంది మహిళలు యువకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి




**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, ఏప్రిల్ 17.** ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, తక్షణమే అమలు చేయాలనీ కోరుతూ..తెలంగాణా ఉద్యోగుల జేఏసి కమిటి చైర్మెన్ లచ్చిరెడ్డి పిలుపు మేరకు శుక్రవారం రోజు స్థానిక తహసిల్దార్ కార్యాలయములో భోజన విరామ సమయములో కార్యాలయ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపినారు. అనంతరం తమ డిమాండ్లలో .జూన్ 2 నాటికి పిఆర్సి అమలు చేయాలి..రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులుచెల్లించాలి .హెల్త్ కార్డులను తక్షణమే అమలు చేయాలి, సిపిఎస్ రద్దు చేసి, ఓ పి ఎస్ ను అమలు చేయాలి,పెండింగ్ బిల్లులతో పాటు, డి. ఎ లను విడుదల చేయాలి,61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏ ల సమస్యలను పరిష్కరించాలి, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి, ఉద్యోగుల ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు చేపట్టాలి మరియు ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి అని తహశీల్దార్ లక్ష్మిరాజయ్య కు మరియు రెవెన్యు డివిజనల్ అధికారి కార్యాలయములో A.O.రంగా కు వినతి పత్రాలు సమర్పించారు. ఇట్టి నిరసన కార్యక్రమములో తెలంగాణ రెవెన్యు సర్వీసెస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, మహిళా ఉద్యోగుల అధ్యక్షురాలు అంజలిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామస్వామి, జిపిఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బండి శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్షుడు బందెల జితేందర్,ప్రధాన కార్యదర్శి ఇనిగాల కృష్ణమూర్తి మరియు తహసిల్దార్, ఆర్డిఓ కార్యాలయల సిబ్బంది జి పి ఓ లు, వీఆర్ఏ లు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడిగా గోపాలకృష్ణ



**నర్సంపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి )** నర్సంపేట ప్రజాపక్షం దినపత్రిక వరంగల్ జిల్లా స్టాఫర్, నర్సంపేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు కోదాటి గోపాలకృష్ణ వరంగల్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు వరంగల్ జిల్లా డీపీఆర్వో మహబూబ్ అలీ,అడిషనల్ డీపీఆర్వో ప్రేమలత చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు,టీయుడబ్ల్యుజే (ఐజేయు) వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రామచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గా ప్రసాద్,మెండు రవీందర్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కమిటీ సభ్యుడిగా నియమితులైన గోపాలకృష్ణకు పలువురు జర్నలిస్టులు,వివిధ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన వారికి గోపాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీడీవోలు



**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి)** వరంగల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాగపద్మజను శుక్రవారం రోజు జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం అధ్యక్షులు సంగెం ఎంపీడీవో కె. రవీందర్, రాయపర్తి ఎంపీడీవో జి. కిషన్, పర్వతగిరి ఎంపీడీవో ఎం. శంకర్ నాయక్, వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ, గీసుగొండ ఎంపీడీవో కృష్ణవేణి, దుగ్గొండి ఎంపీడీవో అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర బిల్లు ఆమోదంలో బిజెపిది కీలక పాత్ర



**వర్ధన్నపేట ఏప్రిల్ 17, ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిన పాత్రపై బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్ర బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడంలో భారతీయ జనతా పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్ లో బిల్లును అడ్డుకునేందుకు ప్రయత్నించారని, పెప్పర్ స్ప్రే ఘటన వంటి సంఘటనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటుకు బీజేపీ పూర్తి మద్దతు ఇచ్చిందని, ముఖ్యంగా సుష్మా స్వరాజ్ పార్లమెంట్ లో తెలంగాణకు అనుకూలంగా చేసిన ప్రసంగం ప్రజలకు ఇంకా గుర్తుందని తెలిపారు.ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి, అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ సమయంలో తెలంగాణ అంశంపై ఎలా స్పందించారో ప్రజలకు తెలుసని ఆయన అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ విభజన విషయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల రెండు రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. బెంగళూరు ఎంపీ తేజస్వి సూర్య పార్లమెం లో చేసిన వ్యాఖ్యలు కూడా రెండు రాష్ట్రాలకు రావాల్సిన హక్కుల గురించి మాత్రమేనని, వాటిని వక్రీకరించి బీజేపీపై విమర్శలు చేయడం సరికాదని మహేందర్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు సరైన ధరలు లేక మార్కెట్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఆ సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ విమర్శలను పక్కనబెట్టి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, తెలంగాణ అభివృద్ధి కోసం కలిసి పని చేయాలని ఆయన హితవు పలికారు.

## తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకోం

- టీపీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి
- జనగణనతో పాటే కుల గణన చేపట్టాలి: కాంగ్రెస్ నాయకులు



**నెక్కొండ, ఏప్రిల్ 17: (ప్రజా జ్యోతి)** డీలిమిటేషన్ ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరిగితే సహించేది లేదని టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లావుడియా తిరుమల్ చౌహన్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం నెక్కొండలోని విశ్రాంతి భవనంలో తిరుమల్ చౌహన్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్య నాయకులు పాల్గొని బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు, ముఖ్యంగా తెలంగాణకు సీట్ల కేటాయింపులో అన్యాయం చేసే కుట్ర జరుగుతోందని, జనాభా ప్రాతిపదికన శాస్త్రీయంగా సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి మాట్లాడుతూ 2027లో చేపట్టే జనగణనతో పాటు కుల గణనను కూడా నిర్వహించాలని కోరారు. ఏపీ–తెలంగాణ విభజనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎంపీ తేజస్వి సూర్య తీరును జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ తీవ్రంగా ఖండించారు. నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ మేరు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉప కోటా కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించేలా పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి, కోశాధికారి కొల్లి సుబ్బారెడ్డి, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం ప్రశాంత్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు రగోతంరెడ్డి, రమేష్ యాదవ్, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హామీలు అమలు చేయాలి

- పీఆర్సీ, పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి
- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ డిమాండ్



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి ):**తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ ఆందోళన చేపట్టారు. టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఈహెచ్ఎస్ ను అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చేయాలని సూచించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) ను అమలు చేయాలని, పెన్షనర్ల బకాయిలను ఏకమొత్తంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీజీ జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ జి. రామ్ కిషన్, జేఏసీ కన్వీనర్ పి.ఎస్. ఫణి కుమార్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, యూటీఎఫ్ నాయకులు కుమార్, సుజన్ ప్రసాద్, ఈ. రవీందర్ రెడ్డి తదితర భాగస్వామ్య సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# తీన్మార్ మల్లన్న చిత్రపటానికి పాలాభిషేకం

- హాజరైన టీ.ఆర్.పి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, ఏప్రిల్ 17.**
శుక్రవారం రోజున జయశంకర్ భూపాలపల్లి జిల్లా అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో టీఆర్పీ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూనిన్న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన సర్వే నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం తెలంగాణ రాజ్యాధికార పార్టీ రెండో విజయంగా అభివర్ణించారు. శాసన మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తూ, ఈ నివేదికను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో తీన్మార్ మల్లన్న గారి పోరాటం కీలక పాత్ర పోషించిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 94 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడే ఏకైక పార్టీ టిఆర్పి పార్టీయేనని పేర్కొన్నారు. గతంలో "ముగ్గురు పిల్లల నిబంధన" ఎత్తివేయడంలో కూడా తీన్మార్ మల్లన్న పోరాటమే కారణమని, అది పార్టీకి మొదటి విజయమైతే, కులగణన నివేదిక విడుదల రెండో విజయమని అన్నారు. శాసన మండలిలో ప్రతి క్షణం పేదల సమస్యలపై ప్రశ్నిస్తూ, బడుగు బలహీన వర్గాల పక్షాన కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలు మార్పు కోరుకుంటారని, 2028లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో ప్రజలకు కార్పొరేట్ స్థాయి సేవలు అందేలా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్, జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గండు కరుణాకర్, యువజన విభాగం అధ్యక్షుడు బండి సునీల్, మహిళా విభాగం అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా కోశాధికారి జినూకల శ్రీను, ఎలక్ట్రిషన్ యూనియన్ విభాగం అధ్యక్షుడు అశోక్, జిల్లా నాయకులు రాజేందర్, లక్ష్మణ్, కృష్ణ, శ్రీకాంత్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 23 వరకు మార్కెట్ కు మక్కలు తీసుకురావద్దు

- మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి విజ్ఞప్తి



**నెక్కొండ, ఏప్రిల్ 17: (ప్రజా జ్యోతి)**నెక్కొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రస్తుతం మొక్కజొన్నలు ఆరబోసేందుకు స్థలం లేనందున, రైతు సోదరులు ఈ నెల 23-04-2026 వరకు మార్కెట్‌కు మక్కలను తీసుకురావద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మార్కెట్ యార్డును సందర్శించి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యార్డులో ధాన్యం నిల్వలు నిండిపోయినందున రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తిరిగి 24-04-2026 (శుక్రవారం) నుండి రైతులు ఎప్పటిలాగే తమ మొక్కజొన్న పంటను మార్కెట్‌కు తీసుకురావచ్చని సూచించారు. ఈ విషయాన్ని గమనించి రైతులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, కానిస్టేబుల్ తిరుపతి, నెక్కొండ సొసైటీ సీఈఓ జనార్దన్, మార్కెట్ సిబ్బంది పెండ్యాల శ్రీనివాస్, పొట్లపల్లి సురేష్, బాల్నే ప్రశాంత్ మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

## నిత్యావసరాల పంపిణీ



**ఏటూరు నాగారం ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి** ఏటూరునాగారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు పంచాయతీ సిబ్బందికి నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కాకులమర్రి శ్రీలత–లక్ష్మణ్ బాబు సిబ్బందికి నూనె బాటిల్స్, సబ్బులను అందజేశారు.గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమం దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని, వారికి అవసరమైన సహాయం అందించడం పంచాయతీ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, గ్రామపంచాయతీ అధికారి సుధాకర్, వావిలాల రాంబాబు, పంచాయతీ సభ్యులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నివారణకు మిల్స్ కాలనీ పోలీసుల ఫుట్ ప్యాట్రోలింగ్

- స్టేషన్ పరిధిలో కట్టుదిట్టమైన బందోబస్తు



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి )**నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు మిల్స్ కాలనీ పోలీసులు విస్తృతంగా ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి (తెల్లవారితే శుక్రవారం ) మిల్స్ కాలనీ ఎస్ హెచ్ ఓ బొల్లం రమేష్, ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో సిబ్బంది మరియు క్విక్ రెస్పాన్స్ టీమ్ కలిసి సాకరాశికుంట, కీర్తి బార్ పరిసరాలు, కరీమాబాద్, ఉర్సు దర్గా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమానాస్పద వ్యక్తులను పరిశీలిస్తూ, అట్టి ప్రాంత ప్రజలతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి ప్యాట్రోలింగ్ కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందేలా చూడాలి

- పౌర సరఫరాల అధికారి సయ్యద్ షా పైసల్ హుస్సేన్

**ములుగు ఏప్రిల్ 17 ( ప్రజా జ్యోతి):** లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందేలా చూడాలి అని పౌర సరఫరాల అధికారి సయ్యద్ షా పైసల్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మల్లంపల్లి మండలం, ములుగు మండలం లోని మహమ్మద్ గౌస్ పల్లి, మల్లంపల్లి, రామచంద్రాపూర్. కోడిశాలకుంట, దేవ నగర్, ములుగు , ఇంచర్ల షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లు సరైన సమయంలో షాపులు తెరుస్తున్నారా, నాణ్యమైన బియ్యం ఇస్తున్నారా, బయోమెట్రిక్ తీసుకుంటున్నారా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి టి సి ఎస్ విజయ్ కుమార్ పాల్గొనడం జరిగింది.



# "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట"తో సర్కారు బడులపై నమ్మకం పెంపు

ఏటూరునాగారం ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి



ఏటూరునాగారం మండలం చిన్నబో యినపల్లి గ్రామంలో నిర్వహించిన "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమం సర్కారు పాఠశాలలపై ఉన్న అపోహలను తొలగిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించింది.ఈ కా ర్యక్రమం కేవలం విద్యార్థులను ప్రభు త్వ పాఠశాలలో చేర్పించడం మాత్రమే కాకుండా, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచే దిశ గా సాగింది. బాధ్యత గల వ్యక్తుల నుం చే మార్పు ప్రారంభమవుతుందనే సం దేశాన్ని ఈ వేదిక స్పష్టంగా తెలియజే సింది.ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపా ధ్యాయులు తమ పిల్లలను సైతం ప్రభు త్వ పాఠశాలలోనే చేర్పించి ఆదర్శంగా నిలిచారు. "ప్రభుత్వ పాఠశాలల్లో నా ణ్యమైన బోధన అందుతోంది. మా పిల్ల లు ఇక్కడే చదివితే సమాజంలో చైత న్యం వస్తుంది" అని వారు తెలిపారు. దీంతో తల్లిదండ్రుల్లో ఉన్న అనుమా నాలు తొలగిపోయాయి.అలాగే ఒక మహిళా విద్యావేత్త మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్లో భారీ ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ పిల్లల్లో సహజ ప్రతిభ పెంపుకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదని, కార్పొరేట్ విద్యా విధానం మార్కులకే పరిమితమవు తోందని అభిప్రాయపడ్డారు. నాణ్య మైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే లభి స్తుందని నమ్మి తన పిల్లలను సర్కారు బడిలో చేర్పించినట్లు తెలిపారు.ప్ర భుత్వం ప్రతి విద్యార్థిపై ఏటా సుమారు రూ.1.10 లక్షల వరకు ఖర్చు చేస్తూ, బూట్లు, యూనిఫామ్‌లు, పుస్తకాలతో పాటు 21 రకాల సదుపాయాలను ఉచితంగా అందిస్తున్నదని అధికా రులు తెలిపారు. పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని కూడా అందిస్తున్నారు.అమెరికా వంటి దేశా ల్లో కూడా ప్రభుత్వ పాఠశాలలే ఉన్నత ప్రమాణాలతో కొనసాగుతున్నాయని, మన దేశంలో ఉన్నత స్థానాల్లో ఉన్న కలెక్టర్లు,వైద్యులు కూడా సర్కారు బడు ల్లోనే చదివినవారని వక్తలు పేర్కొన్నా రు.ఈ స్ఫూర్తితో గ్రామ సర్పంచ్ సహా ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేందుకు సామూహికంగా ప్రతిజ్ఞ చేయడం విశేషంగా నిలిచింది.

# జూన్ 2లోపు పీఆర్సీ అమలు చేయాలి




ఏటూరునాగారం ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి పీఆర్సీ కమిటీ నివేదికను తెప్పించి జూన్ 2లోపు పీఆర్సీ అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ఏళ్ల మధుసూదన్ డిమాండ్ చేశారు.స్టేట్ టీచర్స్ యూనియన్ ములుగు జిల్లా ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలో జిల్లా 2వ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్ కుమార్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ఏళ్ల మధుసూదన్ మాట్లాడుతూ, పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి 30 నెలలు గడిచినా ప్రభుత్వం ఇప్పటికీ పీఆర్సీ అమలు చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. అదే విధంగా ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు, డీఏ వంటి ఆర్థిక ప్రయోజనాలను దీర్ఘకాలంగా నిలిపివేయడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను విడుదల చేయాలని, డీఏలను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వా న్ని కోరారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంచర్ల టవీరభద్రం, ఆర్థిక కార్యదర్శి పోరిక శంకర్, రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ సోలం కృష్ణయ్య, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు అడప రాజేందర్, ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రాంబాబు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు భానోత్ విజయ్, లకావత్ శ్రీనివాస్, సామల సతీష్, పొందా రామారావు, చిచ్చడి గోవర్ధన్, హమీద్, రమేష్, రసపుత్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలి



మంగపేట ఏప్రిల్ 17 ప్రజాజ్యోతి: రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకా లికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్వర్యంలో మండలంలోని తహశీ ల్దార్ కార్యాలయ సిబ్బంది తహశీల్దార్ తోట రవీందర్ కు వినతి పత్రం అందజే శారు. ఉద్యోగుల సమస్యల్లో ప్రధానంగా జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలు పర్చాలని, రిటైర్డైన ఉద్యోగులకు పెండింగ్ బిల్స్ అన్నీక్లియర్ చేసి, ప్రక టిత ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తక్షణమే అమలులోకి తెస్తూ, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డ్స్ జారీ చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరు ద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నియామకమైన ఉద్యోగు లకు ఓపీఎస్ అమలు చేసి, పెండింగ్ బిల్లులతో పాటుగా పెండింగ్ డీఏలను విడుదల చేయాలని గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్స రాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారంతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు.

# రోడ్డు ప్రమాద స్థలాల పరిశీలన చేసిన ఎన్ హెచ్ ఏ ఐ బృందం



రాయపర్తి ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని వరంగల్ –ఖమ్మం జాతీయ రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం శుక్ర వారం పోలీసులతో కలిసి పరిశీలించారు. వర్ధన్నపేట ఏసిపి అంబటి నర్సయ్య, సిఐ కొమ్మూరి శ్రీనివాసరావు, ఎస్ఐ ముత్యం రాజేందర్ లతో కూడిన బృందం ఎన్ హెచ్ ఏ ఐ అధికారులు పరిశీలించి ప్రమాదాల నివారణ కోసం చేప ట్టాల్సిన చర్యలపై చర్చించారు.

# హక్కుల సాధనకై ఉద్యోగుల గర్జన

- నల్ల బ్యాడ్జీలతో నిరసన, తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ
- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్







చెన్నారావుపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి )తమ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చెన్నారావుపేట మండలంలోని వివిధ శాఖల ఉద్యోగులు, ఉపా ధ్యాయులు ఉద్యమ బాట పట్టారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలనా అధికారులు వీఆర్వోలు, రెవెన్యూ మరియు ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు అందరూ ఏకమై భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.

**››› హోరెత్తిన నినాదాలు.. భారీ ర్యాలీ:**

తమ సమస్యల పట్ల ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిప డుతూ, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మండల విద్యా వన రుల కేంద్రం ఎంఆర్ సి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమ ర్పించారు. పీఆర్సీ రిపోర్టును వెంటనే తెప్పించి, నూతన వేతన సవరణను అమలు చేయాలి.ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి.ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. 2004 తర్వాత నియామకమైన ఉద్యోగులకు శాపంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ సిపిఎస్(CPS)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని(OPS) ఓ పి ఎస్ పునరుద్ధరించాలి.పెట్టుబడుల పెన్షన్.. బతుకంతా టెన్షన్ అన్నట్లుగా సీపీఎస్ విధానం తయారైంది. దీన్ని తక్షణమే రద్దు చేయాలి. అని ఉద్యోగ సంఘాల నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో టీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేందర్ గౌడ్, భానోతు వెంకన్న, డీటీఎఫ్ నేతలు భద్రయ్య, ఉమా శంకర్, యూటీఎఫ్ నేతలు పత్తి నరసింహా రెడ్డి, టీవీ సత్యనారాయణ,పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్య క్షులు వికాస్, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు నరేందర్, శ్రీని వాస్, గురుమూర్తి, రెవెన్యూ శాఖ ఉద్యోగులు రషీద్, అంకుష్, బిక్షపతి, మమత, అంజద్ ఖాన్, రాజేందర్, సామ్రాట్, రాజు, గ్రామ పాలన అధికారులు, విద్యాధి కారి పాపమ్మ, అవినాష్, లక్ష్మి , పరుపాటి సుధాకర్ రెడ్డి, హరిపోలేపల్లి రవి, అనిల్, మారి రాజు, ప్రభాకర్ రావు, తగరం యాకయ్య, అజ్మీర స్వామి, బోడ రాజు, రత్నసిందూర్, సుదర్శన చారి, వెంకటేశ్వర్లు, రాజు, పరమేశ్వర్, బొమ్మెర సతీష్, సుష్మ, పద్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# యువకుని క్రీడా ప్రతిభకు చేయూత

- సిల్వర్ మెడల్ సాధించిన సాయికి సన్మానం



ఏటూరునాగారం ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి గ్రామ యువకుని క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ 'చేయూత సహాయనిధి' ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందిం చడం గ్రామంలో ఆనందాన్ని కలిగించింది.తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జూనియర్, మెన్ & ఉమెన్ విభాగాల్లో జరిగిన పోటీల్లో ఏటూరునాగారం మండలానికి చెందిన గుగులోత్ సాయి (తండ్రి సమ్మయ్య) రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించి సిల్వర్ మెడల్ గెలుచుకు న్నాడు. హనుమకొండలోని జెఎన్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో సాయి ప్రతిభ కనబరిచి గ్రామానికి గౌరవం తీసుకొచ్చాడు.సాయి సాధించిన విజ యాన్ని అభినందిస్తూ 'చేయూత' సభ్యులు అతనికి రూ.2000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, సాయి విజయా న్ని ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని యువత క్రీడల్లో రాణించాలని ఆకాం క్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అల్లంల చంటి యాదవ్, దేవు లపల్లి సమ్మయ్య, తీగల క్రాంతి యాదవ్, అంతటి సంతోష్ యాదవ్, కన్నాబో యిన రామకృష్ణ, ఆముదల రమేష్, కుర్మ సతీష్ గౌడ్, కరీం పాషా, శివ, ఎగ్గాడి తేజ, రసకొండ రాకేష్, కోణం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల న్యాయమైన దీర్ఘకాలికమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- రాయపర్తి తాసిల్దార్ కు వినతి పత్రం అందజేత



రాయపర్తి ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఇజేఏసీ) పిలుపుమేరకు శుక్ర వారం తాసిల్దార్ రాయపర్తి కార్యాలయం సిబ్బంది తెలంగాణ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధ నకై తాసిల్దార్ రాయపర్తి కి వినతి పత్రం సమర్పించనైనది. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమారి ఎం ఆర్ ఐ లు చంద్రమోహన్, సంధ్యా రాణి. వీరస్వామి కళ్యాణ్ జూనియర్ అసిస్టెంట్ మురళి అరుణ శిరీష పద్మ జి పి ఓ లు. రమేష్ సురేష్ సదానందం నరేష్ సంపత్ వీరేష్ సంజీవ శంకర్ రాధిక రోజా వెంకటేష్ యుగేందర్ మురళి మనోహర్ రాజు సోమయ్య రాజు సతీష్ అంజయ్య సోమిరెడ్డి లు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 20–26 మొదటి విడత గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలి






- **కలెక్టర్ డా. సత్య శారద**

**వరంగల్ కలెక్టరేట్ ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఎంపీడీవోలు, ఇందిరమ్మ డి.ఇ.ఏ.ఇ.లతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో, ఇందిరమ్మ నోడల్ ఆఫీసర్, ఇన్‌చార్జ్ పీడీ హౌసింగ్ రామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు స్థితి గతులను సమగ్రంగా పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, అర్హులైన లబ్ధిదారులకు సమయానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి పనిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నిర్మాణ నాణ్యతలో ఎటువంటి రాజీ పడకూడదని ఆదేశించారు. ఏప్రిల్ 20 నుండి 26 వరకు మొదటి విడత గృహ ప్రవేశాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమస్యలు ఉన్నట్లయితే గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సమయానికి పూర్తి చేసి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత మండలాల ఎంపీడీవోలు, ఇందిరమ్మ హౌసింగ్ డి.ఇ., ఏ.ఇ.లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహనకు పోలీసుల డెమో కార్యక్రమం



**వర్ధన్నపేట, ఏప్రిల్ 17, ప్రజాజ్యోతి** వర్ధన్నపేట మండలం, కొత్తపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారి–563పై వర్ధన్నపేట పోలీసుల ఆధ్వర్యంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలు, వెంటనే చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు వివరంగా అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు సహాయం ఎలా అందించాలి, అంబులెన్స్‌కు సమాచారం ఎలా ఇవ్వాలి, రక్తస్రావం నియంత్రణ, ప్రాణాపాయం తగ్గించే విధానాలు వంటి అంశాలను ప్రదర్శన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ, సీఐ, ఎస్సైలు, ఎన్‌హెచ్–563 హైవే అధికారులు, ఆర్ & బీ విభాగం అధికారులు, మోటార్ వాహనాల పరిశీలకులు (ఎంవీఐ) పాల్గొన్నారు. అధికారులు కలిసి డెమో ఆక్సిడెంట్‌ను సృష్టించి, ప్రమాదం జరిగినపుడు తక్షణ చర్యలు ఎలా తీసుకోవాలో యువతకు, ప్రజలకు ప్రాక్టికల్‌గా చూపించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు సూచించారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం నివారించడం వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, యువత పెద్ద ఎత్తున హాజరై అవగాహన పొందారు.

## వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతోనే అధిక లాభాలు

- **ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు**



**నెక్కొండ, ఏప్రిల్ 17: (ప్రజా జ్యోతి )** మండలంలోని గుండ్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ బోళ్ల యాదలక్ష్మి శివకుమార్ అధ్యక్షతన రైతులకు వ్యవసాయ సాగు పద్ధతులపై గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పథకం పీడీ విజయ నిర్మల, ఏవో నాగరాజ్, ఏఈఓ రాజేష్ పాల్గొని మాట్లాడుతూ.. రైతులు పాత పద్ధతులను వీడి నూతన విత్తన రకాలు, అధునాతన సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా భూసారాన్ని కాపాడుకోవడానికి యూరియా వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని, దానికి బదులుగా పచ్చి రొట్టె ఎరువులను వాడడం వల్ల భూమికి అవసరమైన పోషకాలు అందుతాయని వివరించారు. ప్రభుత్వం ప్రస్తుతం ఆయిల్ ఫామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, తక్కువ నీటి వినియోగం మరియు తక్కువ శ్రమతో స్థిరమైన ఆదాయం లభించే ఈ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని వారు కోరారు. పురుగు మందుల వాడకంలో శాస్త్రీయ మెలకువలు పాటించాలని, అవసరమైన మేరకే రసాయనాలను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పటాన్ కాసిం, గ్రామస్తులు మరియు రైతులు మందాడి మంగారావు, బోళ్ళ వీరన్న, నల్లగొండ సాంబరాజు, బోళ్ల రాజు, దొంగల రాజు, తాళ్లపల్లి వెంకటయ్య, పరకాల మల్లయ్య, పెద కృష్ణయ్య, ఇటికాల యాకయ్య, ఎల్లబోయిన కుమారస్వామి, ఉదరి రంజిత్, తక్కలపల్లి తిరుమలరావు, అబ్బోజు నరసింహ చారి, కత్తి సాంబయ్య, ఎర్రబెల్లి కిష్టయ్య, పటాన్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ కాంగ్రెస్ నాయకుల ఆదరణ



**ఏటూరునాగారం ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి** మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర యువజన కార్యదర్శి కుంజా సూర్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న సూచనలతో ఏటూరునాగారం మండలం శివపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోగుపెల్లి గ్రామంలో మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో గిలగత్తుల కిరణ్ మరణించగా, ఆయన దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన నాయకులు కుటుంబ సభ్యులను ఓదార్చి, కిరణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబానికి అండగా నిలుస్తూ 50 కేజీల నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పిఎసిఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ దుబ్బాక రాకేష్ రెడ్డి, గోగుపెల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకరి సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు యాస నాగిరెడ్డి, యూత్ అధ్యక్షుడు ఈస మహేష్, సీనియర్ నాయకులు పూనమ్ స్వామి, పార్టీ యాదయ్య, రామగిరి దేవేందర్, బత్తుల యాదగిరి, కురుసం రంజిత్, సోమవారపు సత్యం, కల్తీ యాదగిరి, దొడ్డి సత్యం, జబ్బ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు



**లింగాల గణపురం, ఏప్రిల్, 17 (ప్రజా జ్యోతి )** మండలంలోని నెల్లుట్ల గ్రామంలో నేషనల్ హైవే రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు నిర్వహించిన పోలీసులు రోడ్డు ప్రయాణం చేసే సమయంలో ఎలా ప్రమాదాలకు గురవుతున్నారు అని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రాణాలను రక్షించడంలో కీలకమైన సి పి ఆర్ పై ప్రాక్టికల్ డెమో ఇవ్వడంతో పాటు, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. ప్రమాద బాధితులకు సహాయం అందించే రహత్, రహవీర్ వంటి పథకాలపై పోలీస్ సిబ్బంది మెడికల్ ఆఫీసర్లు 108 ఎమర్జెన్సర్వీస్ ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ, జనగాం ఏఎస్పీ, రఘునాథపల్లి సీఐ, రఘునాథపల్లి, చిల్పూర్ ఎస్‌హెచ్‌ఓలు, గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ,పోలీస్ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్, 108 ఎమర్జెన్సీ సర్వీసెస్ టీం పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకుంటే నగదు బహుమతి

- **అరైవ్ అలైవ్ కార్యక్రమంలో చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్ రెడ్డి.**



**చెన్నారావుపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి)** రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడాలని చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్ సిబ్బందితో కలిసి అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు అనుసరించాల్సిన మెలకువలపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ. మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన మొదటి గంటను గోల్డెన్ అవర్ గా పరిగణిస్తారని, ఆ సమయంలో బాధితులకు వైద్యం అందితే ప్రాణాలు నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు బాధితులకు ప్రథమ చికిత్సగా సి.పి.ఆర్ ఎలా చేయాలో ప్రత్యక్షంగా వివరించారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాహ్–వీర్ పథకం గురించి ఎస్.ఐ. వివరించారు. ప్రమాదంలో గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారు.సహాయం చేసిన వారిని పోలీసులు ఎలాంటి వేధింపులకు గురి చేయరని, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని, వారి వివరాలను కూడా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.అత్యుత్తమ సేవలు అందించిన వారికి ఏటా రూ.1,00,000 లక్ష రూపాయలు జాతీయ అవార్డు పొందే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా మానవత్వంతో స్పందించి ప్రాణదాతలుగా నిలవాలని ఎస్.ఐ. కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణమూర్తి,పోలీస్ సిబ్బంది, వైద్య బృందం, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఎంపీ తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దగ్ధం

- బిజెపి నాయకులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానిస్తే రాజ్యంగాన్ని అంబేద్కర్ ను అవమానించినట్టే
- బిజెపి నేతలకు తెలంగాణ రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు లేదన్న కోటగిరి సతీష్ గౌడ్.



**టేకుమట్ల ఏప్రిల్ 17 ప్రజాజ్యోతి న్యూస్** గురువారం జరిగిన లోక్ సభ సమావేశాల్లో బిజెపి ఎంపీ తేజస్వి యాదవ్ మాట్లాడుతూ.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రా ఏర్పాటును అవహేళన చేస్తూ పాకిస్తాన్ తో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం టేకుమట్ల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో.తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దగ్ధం చేసి బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.ధర్నా కార్యక్రమం నిర్వహించిన కాంగ్రెస్ నేతలు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ మాట్లాడుతూ బిజెపి పార్టీకి తెలంగాణపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని రాజ్యాంగం అంటే చట్టసభలు అంటే గౌరవం లేదని ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుత వాతావరణంలో రాజ్యాంగం ఇచ్చిన హక్కుతో మన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కించపరుస్తూ మాట్లాడడం బిజెపి నాయకులకు అలవాటుగా మారిందని కొన్నిరోజుల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా,ఎంపీ తేజస్వి సూర్య ఇలా చెప్పుకుంటూ పోతే బీజేపీ నాయకులు రాష్ట్రంపై విషం కక్కుతున్నారని.తెలంగాణ రాష్ట్ర నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని.ఎంపీ తేజస్వి సూర్య సభ్యత్వాన్ని రద్దుచేసి అతనిని బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లిని తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానపరుస్తుంటే.చూస్తూ కూర్చున్న తెలంగాణ బిజెపి ఎంపీలకు కనీసం సిగ్గు లేదన్నారు.తెలంగాణ రాష్ట్ర బిజెపి నేతలకు తెలంగాణ ప్రజల ఓటు అడిగే హక్కు లేదన్నారు.ఎంతోమంది ఉద్యమకారులు జీవితాన్ని పణంగా పెట్టి ఎంతోమంది ఆత్మ బలిదానాలతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రాన్ని తక్కువ చేసి మాట్లాడే. ఏ నాయకుడిని వదిలి పెట్టేది లేదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీ కి తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని. ఉద్యమకారుల మనోభావాలకు అనుగుణంగా వారిని వారి ఆశయాలను, ఆలోచనలను కొనసాగిస్తూ నేడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతుందని అన్నారు. బిజెపి నేతల తీరు తెలంగాణ పట్ల ఇదే విధానంగా కొనసాగితే తెలంగాణ ఉద్యమకారుల ఆగ్రహానికి గురై తెలంగాణ రాష్ట్రంలో తిరిగే పరిస్థితి ఉండదని ఈ సందర్భంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని కించపరచడం అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను,అమరుల ఆత్మ గౌరవాన్ని కించపరచడమే అని సతీష్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తోట గట్టయ్య,కత్తి సంపత్ సర్పంచులు నాంపల్లి వీరేశం,బొడ్డు తిరుపతి,కూర రాజిరెడ్డి,గునిగంటి రజినీ మహేందర్, పెరుమాండ్ల చంద్రకళ మొగిలి, అంబాల కిరణ్,తోట సునీత సాగర్,నేరేళ్ల రామకృష్ణ,వంగ మమత శ్రీధర్, కుర్రె మల్లయ్య,మండల ఉపాధ్యకులు మాదం కొమురయ్య, మోతే రాజమౌళి,బీసీ సెల్ మండల అధ్యక్షులు తోడేటి కుమార్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లద్దునూరి ఐలయ్య,టేకుమట్ల టౌన్ అధ్యక్షుడు పెరుమాండ్ల క్రాంతి, అల్లం ఓదెలు,డాగర మల్లేష్, ఇసంపెల్లి పోషాలు,మండల నాయకులు మంద రవి,వంగ నరేష్, ఎనబోయిన రాజేందర్,వరికెలా క్రిష్టారావు, బొల్లు సరోత్తంరెడ్డి,నానవేన రాజు,తిప్పనవేన బాలయ్య,తలగంపల రాజమల్లు,మంద రవీందర్,వేముల సాంబయ్య,యువజన కాంగ్రెస్ నాయకులు పెసరు విఘ్నేష్,అల్లం సతీష్‌తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయండి

- ఈనెల 18న ఛలో హైదరాబాద్
- సభావేదిక మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్, తార్నాక, హైదరాబాద్



**చెన్నారావుపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి )** ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడుఉప్పునూతల లింగమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాతూ.. సభావేదిక మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్, తార్నాక, హైదరాబాద్ అని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలనీ ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు మండలంలోని ఉద్యమకారులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో వరంగల్ జిల్లా ఉమ్మడి వర్కింగ్ ప్రెసిడెంట్ కౌడగాని రాజీరు,జిల్లా ఉపాధ్యక్షుడు మల్లాడి వీరారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మేడిది లక్ష్మణ్, నాయకులు శంకర్ రాజు, మల్లేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్సీ వెంటనే 51 % ఫిట్మెంట్ తో అమలు చేయాలి : టిజిఈజేఏసి



**మంగపేట ఏప్రిల్ 17 ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టిజిఈజేఏసి ఆధ్వర్యంలో మండలానికి చెందిన వివిధ సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జ్ లు ధరించి మండల తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ప్రధాన సమస్యలలో భాగంగా పెండింగ్లో ఉన్న 5 డిఏలను విడుదల చేయాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరణ చేసి, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేసి, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమానికి టిజిఈజేఏసి ఆధ్వర్యంలో వివిధ సంఘాలు నాయకులు ములుకాల వెంకటస్వామి, గుండం పురుషోత్తం, పొడెం మల్లికార్జున్, బండ రాంబాబు, మాలోత్ రాజు, పట్టెం సతీష్, జయ్యారం ప్రవీణ్ కుమార్, మద్దెల నాగేశ్వరరావు, తల్లడి జోష్ణేశ్వరరావు, రామ గోవిందు, జబ్బ రవి, అల్లం నాగభూషణం, తేజావత్ సుక్య, చింత సమ్మయ్య, శ్రీరాముల సతీష్ కుమార్, బాణోత్ శ్రీను, ఆగబోయిన వెంకటేశ్వర్లు, సనప శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల గళం.. నల్లబ్యాడ్జీలతో నిరసన!



**చెన్నారావుపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి )** ఉద్యోగ సమస్యల పరిష్కారం కోరుతూ తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ టీజీఈజెఏసి ఇచ్చిన పిలుపు చెన్నారావుపేట మండలంలో మార్మోగింది. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఉద్యోగులు వినూత్న రీతిలో తమ నిరసనను చాటారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు విధుల్లో ఉంటూనే పోరాట బాట పట్టారు.

### ››› నల్లబ్యాడ్జీలతో విధులకు...

మండలంలోని రెవెన్యూ ఉద్యోగులందరూ ఉదయాన్నే నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయానికి చేరుకున్నారు. నిరసన తెలుపుతూనే ప్రజలకు సేవలందించి తమ నిబద్ధతను చాటుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్యాలయ ప్రాంగణంలో పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.జూన్ 2వ తేదీలోపు పీఆర్సీ అమలు చేయాలనీ,సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ఓ పి ఎస్ పునరుద్ధరించాలి. పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి. హెల్త్ కార్డులు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలనీ అన్నారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల తహసీల్దార్‌కు అందజేశారు. హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ పోరాటంలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ శాఖ సిబ్బంది మరియు టీజీఈ జెఏసి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలకు బాసట

- రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్ కంది శ్వేత-కృష్ణచైతన్య రెడ్డి, ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు.



**చెన్నారావుపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి )** మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కుక్కల సింధు, రమ్య అనే చిన్నారుల పరిస్థితి చూసి మనసు చలించిన పలువురు దాతలు వారికి అండగా నిలిచారు. గతంలో తల్లిని, ఇప్పుడు తండ్రిని కోల్పోయి అనాథలుగా మారిన ఈ పిల్లల దీనగాథను తెలుసుకున్న చెన్నారావుపేట సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కంది శ్వేత–కృష్ణచైతన్య రెడ్డి దంపతులు మానవత్వాన్ని చాటుకున్నారు. తమ వంతు సహాయంగా చిన్నారుల చదువు, ఇతర అవసరాల నిమిత్తం రూ. 5,000 నగదును అందజేశారు.సర్పంచ్ దంపతులతో పాటు ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం స్పందించి మరో రూ. 5,000 ఆర్థిక సాయాన్ని చిన్నారులకు అందజేశారు. కష్టకాలంలో అండగా నిలిచిన దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కంది రవి చైతన్య రెడ్డి, ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టె తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ బల్గూరి నరేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెరుమండ్ల మల్లారెడ్డి పాల్గొన్నారు. మరియు వట్టే శ్రీనివాస్ రెడ్డి, సమ్మెట బిక్షపతి, కుక్కల సాంబయ్య, పెండ్లి ప్రభాకర్, రాహిమోద్దీన్, కాసాని రాజు, పోగుల అశోక్, కాసాని సతీష్, వల్లెపు మహేందర్ రెడ్డి, పెరుమండ్ల సుదర్శన్ రెడ్డి, ఉప్పరపల్లి సర్పంచ్ అభ్యర్థి మేడిపల్లి అశోక్, ఉప్పునూతల రాజు, గూగులోత్ నాని, సీనియర్ పాత్రికేయులు మన్నెం వీరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన లక్ష్మారెడ్డి పల్లి సర్పంచ్



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 17** గణపురం మండలం ఇటీవల నూతన తాసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన అడ్లూరి రాజేశ్వర రావు ను శుక్రవారం లక్ష్మారెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ వీరమల్ల సంపత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ లక్ష్మారెడ్డి పల్లి గ్రామ అభివృద్ధిలో తమకు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు తహసిల్దార్ రాజేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఓద్దుల విజయ అశోక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కాంతాల సమ్మిరెడ్డి కొత్త రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావానికి దక్కిన గుర్తింపు.. తక్కళ్లపాడులో ఉపాధ్యాయునికి ఘన వీడ్కోలు





దామెర ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి) దామెర మండలంలోని తక్కళ్లపాడు ఎంపీ యూపీ పాఠశాలలో సుదీర్ఘంగా 28 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో రాణించిన సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా పాఠశాలలో సన్మాన మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి ఉమ్మడి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా, రాష్ట్ర స్థాయి జ్యోతిరావు పూలే అవార్డు గ్రహీతగా గుర్తింపు పొందిన సత్యనారాయణ-విజయలక్ష్మి దంపతులను అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజేష్ మరియు కాంప్లెక్స్ హెచ్ఎం వై. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని, పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన నిరంతర కృషి ఆదర్శనీయమని కొనియాడారు. స్థానిక సర్పంచ్ దాడి వసంత-రమేష్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. హెచ్ఎం డి. నర్సింగరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, గౌరీశంకర్, మాధవి, రమ్యతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొని సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏటూరునాగారం మండలంలో తొలి హిందూ సమ్మేళనం

- కుటుంబ సమేతంగా హాజరుకావాలని పిలుపు



ఏటూరు నాగారం ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి ఏటూరునాగారం మండలంలో తొలిసారిగా నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి హిందూ బంధువులు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున హాజరుకావాలని నిర్వాహకులు అలువాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనం ద్వారా హిందూ సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలు, సామాజిక ఐక్యతను బలపరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధార్మిక ఉపన్యాసాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హిందూ సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించడానికి ఈ సమ్మేళనం దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాలయం కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, దుర్గారావు. తదితరులు పాల్గొన్నారు

# గంగపుత్ర సంఘం నూతన గ్రామకమిటీ ఎన్నిక



వెంకటాపురం,ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గంగాపుత్రులు (BC)లకు అందే విధంగా అధికారులు చొరవ చూపాలని రాష్ట్ర నాయకులు అన్నారు.శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం బెస్తగూడెం గ్రామపంచాయతీ లోని విజ్ఞేశ్వర స్వామి ఆలయం వద్ద గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంపటి సైదులు ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఏజెన్సీ మారుమూల ప్రాంతంలో ఉన్న గంగపుత్రులు ప్రభుత్వం అందించే రాయితీలు పొందలేక వెనుకబడి ఉన్నారని అన్నారు.వెనుకబడిన తరగతుల ఆర్థిక అభ్యున్నతి కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి,ఇతర సంక్షేమ పథకాలను అందించి నిరుపేదలైన గంగపుత్రులను గుర్తించి ఆదుకోవాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న బీసీలకు ఎక్కువ మొత్తంలో మంజూరు చేయాలని అన్నారు.అనంతరం గంగపుత్ర ఏక సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.బెస్తగూడెం గ్రామ అధ్యక్షుడిగా రామెల్ల శేషగిరి,ఉపాధ్యక్షుడిగా చింతల నాగేష్,ప్రధాన కార్యదర్శిగా తోకల మహేష్,ప్రచార కార్యదర్శిగా పాకాల సమ్మయ్య,కోశాధికారిగా బట్ట శేషగిరి,కార్యవర్గ సభ్యులుగా బట్ట జగదీష్,పాకాల లక్ష్మణరావు,మంచర్ల సర్వేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ కమిటీ సభ్యులుగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ..రాష్ట్ర నాయకులు మా మీద నమ్మకంతో అప్ప చెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని,సంఘం ఎదుగుదల కోసం మా వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.గంగపుత్ర సంఘం బెస్తగూడెం గ్రామ కమిటీకి సంఘ నాయకులు,కార్యకర్తలు,బంధువులు,స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోధుమల సంపత్ కుమార్,అనుమాస సత్యనారాయణ,గ్రామస్తుల మంచర్ల బిక్షపతి,బట్ట ప్రభాకర్,రామెల్ల సతీష్,మంచర్ల రమేష్,బట్ట గోవర్ధన్,తోకల నాగేష్,ప్రసాద్,రామకృష్ణ,మల్లయ్య,సమ్మయ్య,కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ల సాధనకై ఉద్యోగుల నిరసన



వెంకటాపురం,ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి): ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ (ఓపిఎస్) విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు.ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ మహేందర్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ప్రధాన డిమాండ్లు తెలంగాణ రెండవ పిఆర్సిని శివశంకర్ కమిటీ నుంచి తెప్పించుకొని 51% ఫిట్ మెంట్ వెంటనే అమలు చేయాలి.ఉద్యోగుల ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను వెంటనే అమల్లోకి తీసుకురావాలి.13వేల పైచిలుకు ఉన్న ఉద్యోగులు,పెన్షనర్ల పెండింగ్ బిల్లులను ఒకేసారి విడుదల చేయాలి.సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.పెండింగ్ లో ఉన్న మొత్తం 63 డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాలు ఈ సందర్భంగా డిమాండ్ చేశాయిఈ కార్యక్రమంలో తహసిల్దార్,ఎంపీడీవో కార్యాలయాల ఉద్యోగులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# అత్యవసర పరిస్థితిలో రక్తదానం

- ప్రాణదాతగా నిలిచిన యువకుడు బూర వెంకటేశ్వర్లు.



ఏటూరునాగారం ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిలో ఉన్న గర్భిణి మహిళకు సమయానికి రక్తం అందించి ఓ యువకుడు ప్రాణదాతగా నిలిచిన ఘటన హృదయాలను కదిలిస్తోంది. మంగపేట మండలంలోని శనిగకుంట గ్రామానికి చెందిన అరుణ అనే డెలివరీ పేషెంట్‌కు O+ రక్తం అత్యవసరంగా అవసరమవడంతో, ఏటూరునాగారం గ్రామానికి చెందిన బూర వెంకన్న వెంటనే స్పందించి రక్తదానం చేశారు. దీంతో ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాత బూర వెంకన్న మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో రక్తదానం ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ టు సపోర్ట్ బ్లడ్ డోనర్స్ సభ్యులు మల్యాల పవన్ కుమార్, మెరుగు హరీష్, వద్ది నరేష్, నాగవత్ కిరణ్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది మరళి తదితరులు పాల్గొన్నారు. ఈ ఘటనతో స్థానికంగా రక్తదానం పై అవగాహన పెరగడంతో పాటు, సేవా భావం కలిగిన యువతకు ఇది ప్రేరణగా నిలుస్తోంది.

# ఒక్క నిర్లక్ష్యం.. ఇంట్లో వారి కన్నీళ్లకు కారణం

- - పర్వతగిరి సీఐ రాజగోపాల్ హెచ్చరిక





పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) రోడ్లపై క్షణిక నిర్లక్ష్యం కుటుంబాలను కడగండ్లలోకి నెట్టేస్తుందని పర్వతగిరి సీఐ రాజగోపాల్ భావోద్వేగంతో హెచ్చరించారు. మీరు హెల్మెట్ పెట్టుకోకపోవడం, సీటుబెల్ట్ ధరించకపోవడం మీ ప్రాణాలకే కాదు ఇంట్లో మీ కోసం ఎదురు చూస్తున్న వారి కన్నీళ్లకు కారణం అవుతుంది అని అన్నారు. శుక్రవారం ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్‌తో కలిసి అన్నారం గ్రామంలోని తెలంగాణ తల్లి సెంటర్ వద్ద నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ యువత, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఒక్క ప్రమాదం ఒక కుటుంబం మొత్తం జీవితాన్ని చీకటిలోకి నెడుతుంది అని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు చూసి వెళ్లిపోవద్దని, గాయపడిన వారిని కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వెంటనే 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం ఇచ్చి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందిస్తుందని, పోలీస్ శాఖ నుంచి ప్రశంస పత్రం కూడా ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది గుండెపోటు బాధితులకు సీపీఆర్ ఎలా చేయాలో ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, ఉప సర్పంచ్ గౌడుగు ఏకాంత్, వార్డు సభ్యులు, యువకులు, 108 సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగానికి గుడ్‌బై.. ప్రజాసేవకు గ్రీన్ సిగ్నల్

- భరత్ కుమార్ నిర్ణయానికి ఘన స్వాగతం
- - ఒక ఉపాధ్యాయుడి నుంచి ప్రజానాయకుడి దిశగా.. భరత్ కుమార్ అడుగు ఇప్పుడు హాట్ టాపిక్!



**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి)** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సోమారం గ్రామంలో ఓ ఉపాధ్యాయుడు తన ఉద్యోగానికి వీడ్కోలు పలికి ప్రజా సేవ దిశగా అడుగులు వేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసిన రడం భరత్ కుమార్, సర్పంచ్ ఎన్నికల ముందు స్వచ్ఛందంగా ఉద్యోగానికి రాజీనామా చేయడంతో, ఆయనకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ, తక్కువ కాలంలోనే భరత్ కుమార్ తన పనితీరుతో అందరి గుండెల్లో స్థానం సంపాదించారు. విద్యార్థుల కోసం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం, స్వంత డబ్బులతో యూనిఫాంలు, స్కూల్ బ్యాగ్‌లు అందించడం సాధారణ విషయం కాదు. ఇది ఆయనలోని సేవా తత్వానికి నిదర్శనం అని అన్నారు. ఒక ఉపాధ్యాయుడు తన సురక్షితమైన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి ప్రజా సేవ కోసం ముందుకు రావడం అరుదైన విషయం. ఇది ధైర్య నిర్ణయం మాత్రమే కాకుండా సమాజానికి మార్గదర్శకం అని కొనియాడారు. సహ ఉపాధ్యాయులు మాట్లాడుతూ, భరత్ కుమార్ క్రమశిక్షణ, నిబద్ధతతో పాఠశాలలో ప్రత్యేక గుర్తింపు పొందారని, విద్యార్థుల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేశారని గుర్తు చేశారు. ఉద్యోగం వదిలేయడం సులభం కాదు కానీ సమాజం కోసం తీసుకున్న ఈ నిర్ణయం ఆయనలోని నాయకత్వ లక్షణాలను ప్రతిబింబిస్తుంది అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాలువాలు కప్పి, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. భరత్ కుమార్ మాట్లాడుతూ, నాపై చూపిన ప్రేమ, గౌరవం జీవితాంతం గుర్తుంచుకుంటాను. ప్రజల కోసం మరింత కృషి చేయాలనే సంకల్పంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను. భవిష్యత్తులో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తాను అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జంట గ్రామాల సర్పంచులు ఏర్పుల శ్రీనివాస్, జున్ను కనకయ్య, ఎంఈఓ ఏ. బిక్షపతి, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# వెంకటాపూర్ లో నేటి నుండి పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ప్రారంభం



**వెంకటాపూర్ ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలకేంద్రంలో నేటి నుండి పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నూనె నరేష్ తెలిపారు.శనివారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, గ్రామోత్సవం, సాయంత్రం జలాధివాసం విగ్రహాన్ని ప్రతిష్టకు ముందు రాత్రంతా పవిత్ర జలంలో ఉంచే కార్యక్రమం, ఆదివారం ఉదయం గణపతి పూజ సామూహిక హోమాలు, సాయంత్రం లక్ష్మీ పూజలు, దాన్యాధివాసం విగ్రహాన్ని ధాన్యంలో ఉంచి పూజించడం.సకలసంపదలు కలగాలని చేస్తారు. సోమవారం ఉదయం 9 గంటల 29 నిమిషాలకు యంత్ర ప్రతిష్ట,వాస్తు పూజ, ప్రాణ ప్రతిష్ట,దిష్టి కుంభం, ఆశీర్వచనం,అమ్మవారి శక్తిని ఆవాహన చేసే యంత్రాన్ని గర్భగుడిలో స్థాపించడం,ఇదే ప్రధాన ఘట్టం,ప్రాణ ప్రతిష్ట అనగా విగ్రహంలోకి దైవత్వాన్ని ఆహ్వానించి విగ్రహానికి ప్రాణం పోసే క్రతువు ఉంటుందని, మంగళవారం పెద్దమ్మ తల్లి పట్నం,బోనాలు తెలంగాణ సాంప్రదాయం ప్రకారం అమ్మ వారికి బోనం సమర్పించి పట్నం పేరుతో ఘనంగా ఊరేగింపు చేస్తారు.అంగ రంగ వైభవంగా జరుపబడును.భక్తులందరూ కార్యక్రమాలను విజయ వంతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో మంద వీరమల్లు,చొప్పరి సారయ్య,మత్స్యశాఖచైర్మన్ అలువాల ఐలయ్య,రెడ్డి మహేందర్,రెడ్డి పరశురాం, మెట్టు సురేష్,అలువాల చిన్న ఐలయ్య,అన్నబోయిన దేవేందర్,మంద బిక్షపతి,నర్ర సతీష్,సాద యాదగిరి, మేడబోయిన అశోక్,పోలు సుధాకర్,అన్నబోయిన సారంగం,మంద రమేష్, యాట నరేష్,రెడ్డి ప్రవీణ్, రాయనవేన మహిపాల్, బమ్మ సతీష్,రెడ్డి అరవింద్, యాట రజనీకర్,గుల్ల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మండల మీసేవ ఆపరేటర్లు..



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 17** ఇటీవల నూతన తాసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన అడ్లూరి రాజేశ్వరరావు ను శుక్రవారం గణపురం మండల మీసేవ ఆపరేటర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తాసిల్దార్ అడ్లూరి రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన రుసుము కంటే అదనంగా తీసుకోవద్దని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా పనులు చేయాలని తాసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ భాస్కర్, ఆర్ఐలు చెక్క దేవేందర్, రైమత్ పాషా,టీఎంఓఏ జయశంకర్ భూపాలపల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ సిరికొండ రామారావు, మీసేవ గణపురం మండల కన్వీనర్ లావుడియా వినోద్ కుమార్,పాలకుర్తి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీఈ జేఏసీ పిలుపుతో గణపురంలో భోజన విరామ నిరసన



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 17** టీజీఈ జేఏసీ ఇచ్చిన దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా, అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షనర్ల పెండింగ్ బిల్లులు, రెండవ పిఆర్సి అమలు, సిపిఎస్ రద్దు వంటి మొత్తం 64 డిమాండ్ల సాధన కోసం శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గణపురం తహసీల్దార్ అ అడ్లూరి రాజేశ్వరరావు కు వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో టీజీఈ జేఏసీ మండల శాఖ గణపురం పిఆర్టీయూ మండల అధ్యక్షులు బిల్లా రఘునాథరెడ్డి, యుటీఎఫ్ నుండి గోస్కుల వీరన్న, సిపిఎస్ సంఘం నుండి ఎండి దిల్షాద్, డిటీఎఫ్ నుండి రాంబాబు, తహసీల్దార్ కార్యాలయం నుండి డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం నుండి శ్యాంసుందర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అల్లూరి అనూష, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు,దూలం కుమారస్వామి గౌడ్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, మండల పరిషత్ గణపురం సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయం గణపురం సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 17** గణపురం మండలం, చెల్పూర్ గ్రామ వాస్తవ్యులు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొట్టేముక్కుల కేశవ్ రావు మాతృమూర్తి తిరుపతమ్మ దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్ని పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద నివాళులార్పించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ & భూపాలపల్లి జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి బిఆరెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు కుర్చీల వితరణ




**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 17)** మండలంలోని ముల్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు జిజెఎస్ ఫౌండేషన్ ద్వారా 25 కుర్చీలను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసునూటి రాము ఆధ్వర్యంలో జిజేఎస్ ఫౌండేషన్ కన్వీనర్ గంగిశెట్టి వెంకటరత్నం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముల్కలపల్లి గ్రామానికి చెందిన గంగిశెట్టి జనమ్మ వర్ధంతి సందర్భంగా జిజేఎస్ ఫౌండేషన్ ద్వారా పలు స్వచ్ఛంద సేవ కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. సొంత ఊరిలోని పాఠశాలకు సేవ చేసే అదృష్టం కొందరికే ఉంటుందని తల్లిదండ్రుల పేరు మీద సమాజ హిత కార్యక్రమాలు చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గంగిశెట్టి రామకృష్ణ, గంగిశెట్టి శ్రీనివాస్, గంగిశెట్టి రామకృష్ణ నిర్మల, గంగిశెట్టి శ్రీనివాస్ జయశ్రీ, గంగిశెట్టి వెంకటరత్నం లక్ష్మీమని, ఆకుల రామమూర్తి స్వరూప రాణి, ఆకుల రంజిత్ కుమార్ సంధ్యారాణి, సూధం సాంబమూర్తి జలజ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఆర్ పై అవగాహన సదస్సు



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 17)** మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద స్థానిక ఎస్సై ముప్పు సురేష్ అంబులెన్సు సిబ్బందితో కలిసి శుక్రవారం సిపిఆర్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమంలో పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న మనిషిని సిపిఆర్ ద్వారా ఏవిదంగా కాపాడవచ్చునని ప్రత్యక్ష ప్రదర్శన చేసి చూపించారు.అనంతరం ఎస్సై మాట్లాడారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు చివరి దశలో అందించే సిపిఆర్ ప్రాణదానంతో సమానమన్నారు.ఎవరికైనా గుండె పోటు వచ్చినపుడు సిపిఆర్ ద్వారా రక్త ప్రసరణను తిరిగి అవయవాలకు పంపించి ప్రాణాలను కాపాడవచ్చన్నారు.ప్రజలు ఆహారపు అలవాట్లను మార్చుకొని వ్యాయామంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకొని యోగ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అరుణ్ కుమార్, రవి, ఈఎంటి రాజు,పైలెట్ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేటీపీపీ ఆవరణలో ఎండుగడ్డికి మంటలు

- ఎలాంటి ఆస్తి నష్టం లేదు... కెటిపిపి సీఈ శ్రీ ప్రకాష్



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్** 17 ఈనెల 16 గురువారం మధ్యాహ్నం సౌర విద్యుత్ కేంద్రం కోసం కేటాయించిన కేటీపీపీ పరిధిలోని ఖాళీ స్థలంలో ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న ఎండుగడ్డికి మంటలు అంటుకుని దట్టమైన పొగకమ్ముకుందని దీంతో విద్యుత్ ప్లాంట్ కు ఎలాంటి నష్టం జరగలేదని సిఈ శ్రీ ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎండుగడ్డి, పచ్చిగడ్డి కలిసి ఉండటంతో ప్రాంతమంతా భారీగా పొగలు కమ్ముకున్నాయని ఈ ఘటనపై కేటీపీపీ యాజమాన్యం సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, త్వరితగతిన ddమంటలు పొగను అదుపులోకి తెచ్చారని ఈ సంఘటన వల్ల విద్యుత్ ఉత్పత్తి సంస్థకు ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని ప్లాంట్ ఆవరణలో నిల్వ ఉంచిన బొగ్గు లేదా ఇతర అవశేషాల వల్ల ఈ ఘటన సంభవించలేదని బొగ్గు నిల్వ ఉన్న ప్రాంతం ఈ సంఘటన చోటుచేసుకున్న ప్రదేశానికి చాలా దూరంలో ఉందని కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న వార్తలు అసత్యమైనవని సీఈ శ్రీ ప్రకాష్ తెలిపారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత డాక్టర్ జి వై సోమయ్య ఘన సన్మానం



**పాలకుర్తి ఏప్రిల్ 17/ ప్రజా జ్యోతి/** రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యం లో దళిత రత్న అవార్డు గ్రహీత డాక్టర్ జి వై సోమయ్యను శుక్ర వారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించడం జరిగింది.డాక్టరువృత్తిలో జీవై సోమయ్య గత 30సంవత్సరాలుగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద వర్గాలకు సేవలు అందిస్తు,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే సేవల కార్యక్రమాలలో వారి ఆశయాలను ప్రజలకు తెలియజేశారని, వారి సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి దళిత రత్న అవార్డు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి అభినంద నలు తెలుపరు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమ్మగాని ఆంజనేయులు, యాదవ సంఘం అధ్యక్షులు సలేంద్ర శ్రీనివాస్, సంఘీ వెంకన్న, పన్నీరు వెంకన్న మాజీ ఎంపీటీసీ అంగడి సోమ నరసయ్య, ఎడవెల్లి సుభాష్, పులి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు గంజాయి నిందితుల అరెస్ట్



**టేకుమట్ల ఏప్రిల్ 17 ప్రజాజ్యోతి న్యూస్** మండలం లోని కుందనపల్లి గ్రామానికి చెందిన మాడుగుల ఉదయ్ కుమార్ తండ్రి వీరయ్య,33 సంవత్సరాలు తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నారని సమాచారం మేరకు టేకుమట్ల ఎస్ఐ అమూల్య పోలీస్ సిబ్బంది తో ఉదయ్ కుమార్ ఇంటికి చేరుకోగా అప్పుడే గంజాయి మొక్కలకు నీరు పోస్తుండగా అతడిని పట్టుకొని విచారించగా,అతనికి ఇంత కు ముందే గంజాయి తాగే అలవాటు ఉన్నది అని మరియు అతడు వావిలాల గ్రామానికి చెందిన ఐలాపురం రాహుల్ తండ్రి స్వామి తరచుగా గంజాయిని అమ్ముతాడాని చెప్పగా,అతని సమాచారం మేరకు రాహుల్ ని అదుపులోకి తీసుకొని విచారించగా తన వద్ద రెండు ఎండు గంజాయి పొట్లాలు దొరికినట్లు తెలిపారు.అట్టి ఎండు గంజాయి మరియు రెండు చెట్లను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు చేసి జైలు కి తరలించినట్లు చిట్యాల సిఐ మల్లేశ్ తెలిపారు.గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టేకుమట్ల ఎస్ఐ అమూల్య మరియు సిబ్బంది వెంకటేష్,హారిశ్ లని డి.ఎస్.పి సంపత్ రావు మరియు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు.

# మద్యం షాప్ ముందు జి పి పాలకవర్గం నిరసన

- బ్రాండి షాప్ సిట్టింగ్ లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు
- పార్కింగ్ స్థలం లేక ట్రాఫిక్ జామ్
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- పలుమార్లు నోటీసులు ఇచ్చిన స్పందించని వైన్స్ యాజమాన్యం



**ప్రజాజ్యోతి -మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 17)** మద్యం షాప్ వద్ద పార్కింగ్ స్థలం లేక ట్రాఫిక్ జామై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలని పలు మార్లు గ్రామపంచాయతీ పాలకవర్గం నోటీసులు జారీ చేసిన పట్టించుకోకపోవడంతో శుక్రవారం స్థానిక సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం మద్యం షాప్ వద్దకు వెళ్లి యజమానులపై ఆగ్రహంతో నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి రెండు వైన్ షాప్ లకు ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేసింది. అట్టి రెండు వైన్ షాప్ ల యజమానులు సిండికేట్ గా మారారు. లాభార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ ధరలకు గ్రామాలలోని బెల్ట్ షాపులకు మద్యంను విక్రయిస్తున్నారు. దీంతోపాటు మద్యం షాప్ వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోవడంతో ట్రాఫిక్ జామ్ ఎక్కువై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారిపై మద్యం షాప్ ఉండడంతో అక్కడ పార్కింగ్ స్థలం లేని కారణంగా వాహనదారులు రోడ్లపై వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బ్రాండీ షాప్ సిట్టింగ్ లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేని కారణంగా మద్యం ప్రియులు రోడ్లకు ఇరువైపులా మలమూత్ర విసర్జన చేయడంతో దుర్వాసనతో ప్రజలు నానా నరకయాతన పడుతున్నారు. ఇట్టి విషయంపై స్థానిక గ్రామపంచాయతీ పాలకవర్గం బ్రాండీ షాప్ యజమానులకు రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ మద్యం షాపు యజమానులు స్పందించకపోవడంతో గ్రామపంచాయతీ పాలకవర్గం నిరసన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా బ్రాండీ షాప్ యజమానులు స్పందించి ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా వాహనాల పార్కింగ్ స్థలంతో పాటు మద్యం షాప్ లో మూత్రశాలలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని లేకుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బ్రాండీ షాప్ యజమాన్యంపై చర్యలు తీసుకునేలా గ్రామ పంచాయతీ పాలకవర్గం జిల్లా కలెక్టర్ దృష్టికి ఇట్టి సమస్యలను తీసుకువెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు, వార్డు సభ్యులు రాజేశ్వర్ రావు, కుమార్, మహేష్, శ్రీనివాస్,కార్యదర్శి నరేష్, మహిళా వార్డు సభ్యులు ఉన్నారు.

## డబ్బాలు తొలగించాలని నోటీసులు



**ప్రజాజ్యోతి -మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 17)** మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన నిర్మించిన డబ్బాలను వెంటనే తొలగించాలని శుక్రవారం గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ ఆధ్వర్యంలో జి పి పాలకవర్గం డబ్బా యజమానులకు నోటీసులు జారీ చేశారు.ప్రధాన రహదారిపై నిర్మించిన డబ్బాల వలన ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం స్పందించి డబ్బా యజమానులకు నోటీసులు జారీ చేశారు. రహదారిపై నిర్మించిన డబ్బాలను వెంటనే తొలగించి ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు పాలకవర్గం చర్యలు తీసుకున్నారు. వెంటనే రోడ్లపై నిర్మించిన డబ్బాలను తొలగించాలని సర్పంచ్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు, వార్డ్ మెంబర్లు మల్సాని రాజేశ్వర్ రావు, చిలుకమారి శ్రీనివాస్, అర్షం మహేష్, బండారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రైతు వ్యతిరేక విధానాలకు వెంటనే వెనక్కి తీసుకోవాలి

- తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 18న చలో హైదరాబాద్
- -యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్



**నర్సంపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి )** రైతు అంటే దేశానికి వెన్నెముక కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత 10ఏళ్లుగా రైతు నడ్డి విరిచే చట్టాలే చేస్తోంది.దీనికి నిరసనగానే తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 10రోజులు కిసాన్ న్యాయ్ సత్యాగ్రహ దీక్ష వరంగల్ జిల్లా పోచమ్మ మైదానంలో చేయడంజరిగింది.ముగింపు దీక్ష ఈ నెల 18న, హైదరాబాద్ ఇందిర పార్క్ లో ధర్నా చౌక్ లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది కావున ఈ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ నాయకుల పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకొని నల్ల వ్యవసాయ చట్టాలను పూర్తిగా రద్దు చేసి రైతుల ఉసురు పోసుకుంటున్న రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దుచేసి ఇండో-యూఎస్ వ్యవసాయ ఒప్పందాలు అమెరికా నుంచి గోధుమలు, పప్పుధాన్యాలు దిగుమతి చేసుకుని మన రైతు పండించిన పంటకు ధర లేకుండా చేస్తున్నా.ఈ దేశద్రోహ ఒప్పందాలు వెంటనే రద్దుచేయాలనీ. రైతు పొలంలో విత్తనం నాటితే పంట పండుతుంది. రైతు గుండెల్లో ఆగ్రహం నాటితే ప్రభుత్వాలే కూలుతాయనీ మోడీ ప్రభుత్వం దిగొచ్చి రైతుతో చర్చలు జరపాలీ. లేదంటే దేశవ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతాం మని డిమాండ్ చేశారు.

## పర్వతగిరిలో భయానక క్షుద్రపూజలు.. ఖాళీ ఇంటిని టార్గెట్ చేసిన దుండగులు..!

**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి )** పర్వతగిరి అల్లూరి కాలనీ ఒక్కసారిగా భయంతో వణికిపోయింది. తుంగ రవిందర్ ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించడం తీవ్ర కలకలం రేపింది. బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి హైదరాబాద్ లో ఉంటున్న రవిందర్ ఇంట్లో ఎవరూ లేరని ముందుగానే గమనించిన దుండగులు ప్లాన్ ప్రకారమే ఈ దారుణానికి పాల్పడ్డారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు నిమ్మకాయలు, కొబ్బరికాయలు, రక్తం చిందించినట్లుగా కనిపించే పదార్థాలు, అనుమానాస్పద పూజా సామగ్రి కనిపించడం ప్రజల్లో గుబులు రేపుతోంది. ఈ ఘటన చూసిన వారంతా భయంతో ఇళ్లలో నుంచే బయటకు రావడానికి కూడా వెనుకాడుతున్న పరిస్థితి నెలకొంది. ఇది సాధారణ విషయం కాదు ఎవరో ఉద్దేశపూర్వకంగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు అంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు దీనికి వెనుక వ్యక్తిగత కక్షలు ఉన్నాయా? లేక మరేదైనా పెద్ద కుట్ర ఉందా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

